మంగళవారం
29-10-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 38
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు 'కిమ్' సేన

ప్యాంగ్యాంగ్: ఉక్రెయిన్‌పై రష్యా భీకరదాడులు కొనసాగుతున్నాయి. ఉక్రెయిన్‌తో మరింతగా పోరాడేందుకు ఉత్తర కొరియా తన బలగాలను రష్యాలోకి తరలిస్తోంది. ఈ విషయాన్ని నాటో తాజాగా ధ్రువీకరించింది. ఇప్పటికే రష్యాలోని కొన్ని ప్రాంతాల్లో కిమ్ బలగాలను మోహరించినట్లు తెలిపింది. రష్యాలోని కుర్స్ ప్రాంతంలో కొన్ని బలగాలను మోహరించినట్లు నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే మీడియాకు వెల్లడిం చారు. ఉక్రెయిన్- రష్యా యుద్ధంలో ఉత్తర కొరియా జోక్యం చేసుకోవడం సమంజసం కాదని, ఈ చర్య ఉన్న పరిస్థితిని మరింత తీవ్ర తరం చేయడమేనని వ్యాఖ్యానించారు. రష్యాలోకి కిమ్ సేన ప్రవేశించే అంశంపై ఇటీవల అమెరికా స్పందించింది. ఒకవేళ ఉత్తర కొరియా సైనికులు ఉక్రెయిన్ యుద్ధంలోకి చొరబడితే... కచ్చితంగా వాళ్లు కూడా లక్ష్యాలుగా మారతారని హెచ్చరించింది.

చిరంజీవికి ఏఎన్నార్ జాతీయ అవార్డు ప్రదానం

హైదరాబాద్: నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్) జాతీయ అవార్డును టాలీవుడ్ అగ్రనటుడు చిరంజీవి అందుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో ఏఎన్నార్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. 2024వ ఏడాదికి గాను ఏఎన్నార్ జాతీయ అవార్డును బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా తెలుగు అగ్ర నటుడు చిరంజీవికి ప్రదానం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఈ అవార్డును చిరంజీవికి

- మిగతా 2 లో

ఏపీలో ఉచిత గ్యాస్‌కు రూ.895 కోట్లు విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దీపావళి పండుగ కానుకగా మహిళలకు ఏటా మూడు ఉచిత సిలిండర్లు అందించనున్న పథకానికి రాయితీ కింద తొలిదశ నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్యాస్ కంపెనీలు, పౌరసరఫరాలశాఖ తెరచిన ఖాతాలో ఈ నిధులు జమచేయనున్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఒక సిలిండర్ రాయితీ మొత్తం రూ.895 కోట్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు

- మిగతా 2 లో

కాలుష్యంపై పోరాటానికి

10 వేల మంది వలంటీర్లు: ఆతిశీ

న్యూఢిల్లీ: చలికాలం వస్తుందంటే దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత పడిపోతూ ఉంటుంది. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు 10 వేలమంది పౌర రక్షణ వలంటీర్లను మోహరిస్తామని ముఖ్యమంత్రి ఆతిశీ వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ, ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ, రవాణా విభాగం బృందాలతో పాటు వలంటీర్ల సేవలు ఉపయోగించుకుంటామని తెలిపారు. వచ్చేవారం నుంచి

- మిగతా 2 లో

13 మంది ఐఏఎస్‌ల బదిలీ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో 13 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నారాయణరెడ్డి, నల్గొండ కలెక్టర్‌గా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా హనుమంతరావు నియమితులయ్యారు. వివరాలు... టి.కె.శ్రీదేవి - పురపాలక శాఖ డైరెక్టర్, మంద మకరందు - సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్, జెడ్.కె. హనుమంతులు - పర్యాటకశాఖ డైరెక్టర్ ... దేవదాయశాఖ సంచాలకులుగా అదనపు బాధ్యతలు, శశాంక- రాష్ట్ర ప్రాధాన్య ప్రాజెక్టుల కమిషనర్, ఎస్.హరీశ్ - ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్... విపత్తు నిర్వహణశాఖ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు, వినయ్‌కృష్ణారెడ్డి - ఆర్ అండ్ ఆర్ భూసేకరణ కమిషనర్, ఆయేషా మస్రత్ - వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి, వాణిజ్య పన్నులశాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు, కె. చంద్రశేఖర్‌రెడ్డి - డెయిరీ కార్పొరేషన్ ఎండీ, ఎస్. దిలీప్‌కుమార్ - నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్, సోని బాలదేవి - క్రీడాశాఖ సంచాలకులు (అదనపు బాధ్యతలు), కొర్రా లక్ష్మి - రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీ... స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు, ఎస్. క్షితిజ - ఎస్సీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ, సుభద్రా దేవి - జీహెచ్ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ అదనపు కమిషనర్, జి.జ్ఞానేశ్వర్ - వికారాబాద్ డీఎఫ్ఓగా నియమితులయ్యారు.

రైతు భరోసా ఇవ్వండి

పూర్తి రుణమాఫీతో పాటు దొడ్డ వడ్లకు రూ.500 బోనస్

రైతు సంఘం నేతల డిమాండ్

2లో

సమసమాజ స్థాపనే ధ్యేయం

- బీసీల ఉద్యమాలకు కమ్యూనిస్టుల సంపూర్ణ మద్దతు
- 'జనగణనలో కులగణన' రాష్ట్ర సదస్సులో కూనంనేని

విశాలాంధ్ర-హైదరాబాద్: సమసమాజ స్థాపనే లక్ష్యంగా మొట్టమొదటి నుంచి ఉద్యమిస్తున్నది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కమ్యూనిస్టు పార్టీ జరిపిన వర్గపోరాటాల చైతన్యమే నేటి కుల చైతన్యానికి స్ఫూర్తి అని ఆయన పేర్కొన్నారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'జనగణనలో కులగణన' అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ... సమాజంలో అన్ని రంగాలు, వర్గాలకు సమ న్యాయం జరగాలన్నదే కమ్యూనిస్టుల లక్ష్యమని తెలిపారు. న్యాయం కోసం బీసీలు చేస్తున్న ఉద్యమాలకు కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ప్రపంచ స్వరూపాన్ని మార్చేది ఎర్రజెండానే అన్నారు. అధికారం లేకపోయినా ప్రజల పార్టీ కాబట్టే 100 ఏళ్లు వర్ధిల్లిందన్నారు. బీజేపీ కులాల వారీగా రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూనే మతాన్ని, దేవుళ్లను అడ్డంపెట్టుకుని రాజకీయాలు చేయడం వల్లనే అధికారంలోకి వచ్చిందన్నారు. కులం కోర్రలు పికాలంటే ఆదివాసీ, గిరిజన, దళిత, బీసీ వర్గాలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం జరగాలన్నారు.

కులం... సామాజిక వాస్తవం: ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్

ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ... భారత దేశంలో కులం అనేది సామాజిక వాస్తవం, మనకు ఇష్టమున్నా లేకపోయినా ఏదో ఒక కులంలో పుట్టాల్సిందేనన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ మన దేశంలో సుమారు నాలుగు వేల సంవత్సరాల నుంచి పాతుకుపోయిందని తెలిపారు. 89 శాతంగా ఉన్న దళిత, బలహీన వర్గాలను బ్రాహ్మణీయ సమాజం అణిచివేయడంతో వెనుకబాటు తనానికి కారణమన్నారు. బీసీలకు జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తే తప్ప ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొన్న తరుణంలో దాని సాధనకు సంఘటితంగా ఉద్యమించాల్సిందేనన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ మాట్లాడుతూ బీసీ హక్కుల కోసం ఉద్యమిస్తూనే మరోవైపు అణగారిన వర్గాలకు జరుగుతున్న దాడులను నిలువరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా సాధన సమితి అధ్వర్యంలో చైతన్యజాతను చేపట్టనున్నామన్నారు. తాటిపాములు వెంకట్రాములు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బీసీ కుల సంఘాలు భుజం భుజం కలిపి కలిసిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 77 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో ఆదివాసీ, గిరిజన, దళిత, బీసీ వర్గాలకు నేటికి రిజర్వేషన్ల కోసం అడుక్కునే పరిస్థితి ఉండడం దారుణమని గిరిజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కె.కాంతయ్య మాట్లాడుతూ బ్రాహ్మణీయ అధిపత్యం బద్దలు కొట్టాలంటే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించుకోవాల్సిందేనని పిలుపునిచ్చారు. జి. సాయిల్ గౌడ్ (గీత పనివారుల సంఘం), బొడ్డుపల్లి కృష్ణ (రజక సంఘం), డి.టి.నర్సయ్య (మత్స్య కార్మిక), ధనంజయ నాయక్, తాటి వెంకటేశ్వరరావు, పి.యాదయ్య, మెరుగు కుమార్, కె.ప్రమిల, శ్రావణ్ కుమార్, ఎన్.రాజమౌళి, సీహెచ్ దశరథ్, ఉమా మహేశ్, జె.లక్ష్మి, కొలా జనార్దన్, చీమల శంకర్ హాజరయ్యారు.

40 ఏళ్లు రిజర్వేషన్లు లేకపోవడమే బీసీల వెనుకబాటుకు కారణం: చిరంజీవులు

విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు మాట్లాడుతూ... బీసీలకు పాలక వర్గాలు అన్యాయం చేస్తూనే ఉన్నాయని మండిపడ్డారు. బ్రిటిష్ హయాంలో 1931లో నిజాం కాలంలో కులగణన జరిగిందని, స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్నా నేటికి కులగణన చేపట్ట లేదన్నారు. 1951 నుంచి 1991 వరకు అంటే దాదాపు 40 ఏళ్ల పాటు బీసీలు లక్షల సంఖ్యలో ఉద్యోగాలు, విద్యా అవకాశాలను కోల్పోవడంతోనే నేటి వెనుకబాటు తనానికి కారణమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మూడున్నర కోట్ల జనాభా ఉంటే బీసీ జనాభా 61 శాతమని... హక్కులను సాధించుకునేందుకు ఏకతాటిపై నడవాలన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి

ప్రత్యేక కమిటీ

- కూటమి ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి
- సీఎం అఖిలపక్షంతో సంప్రదించాలి: రామకృష్ణ
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి: ముప్పాళ్ల
- మహావిజ్ఞాపన దీక్షకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు

విశాలాంధ్ర -విజయవాడ: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో సోమవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద అగ్రిగోల్డ్ బాధితులు చేపట్టిన మహా విజ్ఞాపన దీక్షను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సీపీఐ నాయకత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి బాధితుల సమస్యను పరిష్కరించాలని కోరతామని స్పష్టం చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి అఖిలపక్ష నేతలతో సంప్రదించి వారి సూచనలు, సలహాలతో సమర్థ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులో ఈ సమస్యను పరిష్కరించడమే చంద్రబాబు పరిపాలనా దక్షతకు నిదర్శంగా ఉంటుందన్నారు. కాలం గడిచిన తరువాత పరిష్కరిస్తే

- మిగతా 2 లో

ముగ్గురు కొత్త జడ్జిల

ప్రమాణం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన ముగ్గురు జడ్జిలతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సోమవారం ప్రమాణం చేయించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్లో జరిగిన కార్యక్రమంలో మహేశ్వరరావు కుంచెం (అలియాస్ కుంచం), తూటా చంద్ర ధనశేఖర్ (అలియాస్ టీసీడీ శేఖర్), చల్లా గుణరంజన్‌తో అదనపు న్యాయమూర్తులుగా సీజే ఠాకూర్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో అత్యంత నిరాడంబరంగా జరిగిన ఈ అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథ్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి.పొన్నారావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ డా.వై.లక్ష్మణరావు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

కుల గణన ఊసే లేదు

2025 నుంచి జనగణన... 28లో నియోజకవర్గాల పునర్విభజన: కేంద్ర ప్రభుత్వం యోచన

న్యూఢిల్లీ: దేశంలో జనగణన ప్రక్రియ 2025లో ప్రారంభం అవుతుందని సంబంధిత వర్గాలు సోమవారం వెల్లడించాయి. రాబోయే ఏడాది నుంచి జనాభా లెక్కలు ప్రారంభమవుతాయని, 2028లో నియోజకవర్గాల పునర్విభజన, దేశంలో జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. జనగణన 2025లో ప్రారంభమై 2026 వరకూ కొనసాగనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీని అనంతరం లోక్‌సభ స్థానాల విభజన ప్రక్రియ ఉంటుందని తెలిపాయి. అది 2028కి ముగుస్తుందని వెల్లడించాయి. జనగణన పూర్తి కావడానికి దాదాపు 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోంశాఖ దీనికి నేతృత్వం వహించనుంది. 2026లో ప్రభుత్వం గణాంకాలను వెల్లడించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తుది అనుమతులు రాగానే జనాభా లెక్కల

- మిగతా 2 లో

భారతీయ అమెరికన్ల మద్దతు హారిస్‌కే

అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం వాడీవేడిగా సాగుతోంది. తాజా సర్వేల్లో భారతీయ అమెరికన్ల మద్దతు డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్‌కే ఉందని వెల్లడైంది. 61 శాతం మంది భారతీయ అమెరికన్లు హారిస్ వైపే ఉన్నారని 'ఇండియన్ అమెరికన్ ఆటిట్యూడ్ సర్వే' వెల్లడించింది.

2 లో

ఇదీ లోకం!

వాళ్లపై అత్యాచారాలు అరికట్టడమే నిజమైన దీపావళి కానుక అనుకుంటాను, మీరేమంటారు సార్!?

బుచ్చమ్మది ప్రభుత్వ హత్య

- కాంగ్రెస్ పాలనలో పేదల ఇళ్లల్లో చీకట్లు
- బిల్డర్లను బెదిరించి చందాలు
- సీఎం రేవంత్‌రెడ్డి చర్యలపై కేటీఆర్ ధ్వజం

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా పేదల ఇళ్లల్లో చీకట్లు కమ్మాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైడ్రా కూల్చివేతల భయంతో కూకట్‌పల్లిలో ప్రాణాలు కోల్పోయిన బుచ్చమ్మ కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అనాలోచితంగా నల్ల చెరువు వద్ద కూల్చివేతలు చేపట్టారని మండిపడ్డారు. హైడ్రా అనే బ్లాక్ మెయిల్ సంస్థను పేదలపైకి ఉసిగొల్పి, నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లు కూలగొడుతామంటూ భయానక వాతావరణం కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిందని విమర్శించారు. పిల్లలు

- మిగతా 2 లో

కలవరపాటు!

- స్టార్ హోటళ్లకు బాంబు బెదిరింపులు
- విజయవాడ, తిరుపతిలో మెయిల్స్ ద్వారా హెచ్చరికలు
- యాజమాన్యాలు ఆందోళన... పోలీసుల తనిఖీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హోటళ్లకు బాంబు బెదిరింపుల సంస్కృతి రాష్ట్రానికి విస్తరించింది. గతంలో ఎయిర్‌పోర్టులు, థియేటర్లు, క్రికెట్ స్టేడియాలు, పెద్దపెద్ద మాల్స్‌కు బాంబు బెదిరింపులు రాగా... ఇప్పుడు హోటళ్లకూ మెయిల్స్ ద్వారా వస్తున్నాయి. ఊహించని విధంగా ఇలాంటి సంఘటనలు ఎదురవ్వడంతో యాజమాన్యాలు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా విజయవాడ, తిరుపతిలోని అనేక హోటళ్లకు బాంబు బెదిరింపుల హెచ్చరికలతో యాజమాన్యం కలవరపాటుకు గురైంది. విజయవాడ, విశాఖ, గుంటూరు, తిరుపతి తదితర ప్రాంతాల్లో పేరొందిన అనేక స్టార్ హోటళ్లు నడుస్తున్నాయి. వాటికి నిత్యం ప్రజాప్రతినిధులు, సెలబ్రెటీలు, ప్రముఖులు వస్తుంటారు. బాంబు బెదిరింపులతో హోటళ్లకు వచ్చే వీఐపీలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆయా హోటళ్లలో బస చేసినవారు కలవపాటుకు గురయ్యారు. ఆధునిక సాంకేతిక

- మిగతా 2 లో

రహస్య జీవోలు

ప్రజల ముంగిటకు

ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన రహస్య జీవోలను ప్రజలందరికీ కనిపించేలా చేయాలని చంద్రబాబు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైఎస్ జగన్ హయాంలోని రహస్య జీవోలను జీవోఐఆర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. 2021 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 28వ తేదీ వరకూ గోప్యంగా ఉంచిన జీవోలన్నిటినీ జీవోఐఆర్

- మిగతా 2 లో

ఇరాన్ సైనిక స్థావరాలపై దాడి

శాటిలైట్ దృశ్యాలు విడుదల

దుబాయ్: ఇరాన్ రాజధానికి ఆగ్నేయంగా ఉన్న ఓ రహస్య సైనిక స్థావరం పర్చిన్‌పై జరిపిన దాడికి సంబంధించిన శాటిలైట్ దృశ్యాలు విడుదలయ్యాయి. ఈ స్థావరంలో అనేక భవనాలు ధ్వంసమయ్యాయి. అణ్వాయు ధాల తయారీకి సంబంధించిన అధిక పేలుడు పదార్థాల పరీక్షలను ఇరాన్ గతంలో నిర్వహించిందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. సమీపంలోని ఖోజీర్ సైనిక స్థావరంలో కూడా కొన్ని భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రాంతంలో భూగర్భ సొరంగం వ్యవస్థ, క్షిపణి తయారీ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని బయటి ప్రపంచానికి తెలియకుండా ఇరాన్ దాచిపెట్టిందని ఆరోపించాయి. సైనిక స్థావరాలపై దాడి నష్టాన్ని ఇరాన్ ధృవీకరించలేదు. ఇజ్రాయిల్ దాడిలో వైమానిక రక్షణ వ్యవస్థలో పనిచేస్తున్న నలుగురు ఇరాన్ సైనికులతో పాటు ఓ పౌరుడు మరణించినట్లు ప్రకటించింది. మృతుల వివరాలను వెల్లడించలేదు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు నైరుతి, పశ్చిమ ప్రాంతాల్లోని వైమానిక, సైనిక స్థావరాలపై శనివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ వైమానిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ దాడిని సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఈజిప్ట్, యెమెన్, మలేషియా, సిరియా, జోర్డాన్, లెబనాన్ తదితర దేశాలు తీవ్రంగా ఖండించాయి.

జపాన్ ఎన్నికల్లో అధిక శాతం మహిళల ఎన్నిక

టోక్యో: జపాన్ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో మహిళలు విజయం సాధించారు. భారీగా మహిళలు జపాన్ ప్రతినిధుల సభకు ఎన్నుకయ్యారు. అయితే 16 శాతం కన్నా తక్కువ... ఇంకా మైనారిటీలో కొనసాగుతున్నారు. 465 సీట్లు కలిగిన దిగువసభలో 73 సీట్లను మహిళలు గెలుచుకున్నట్లు ప్రభుత్వ మీడియా ఎన్‌హెచ్‌కే తెలిపింది. సోమవారం తర్వాత అధికారిక ఫలితాల్లో ఈ గణాంకాలు ధృవీకరించబడతాయని భావిస్తున్నారు. 2021 సాధారణ ఎన్నికల్లో దిగువసభకు 45 మంది మహిళలు ఎన్నికయ్యారు. ఈ ఏడాది ఎన్నికల్లో మహిళలు ఎక్కువమంది పోటీ చేస్తున్నారని, దాదాపు నాలుగవ వంతు అభ్యర్థులు ఉన్నట్లు ప్రభుత్వ మీడియా, ఇతర సంస్థలు ప్రకటించాయి.

జపాన్‌లో ఇప్పటికీ వ్యాపారాలు, రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉందని, 146 దేశాల జాబితాలో జపాన్ 118 ర్యాంకులో ఉన్నట్లు ప్రపంచ ఆర్థిక వేదికకి చెందిన ప్రపంచ లింగ అసమానత సూచీ నివేదిక పేర్కొంది. ప్రధాని షిగెరు ఇషిబాకి చెందిన 20 మంది సభ్యుల కేబినెట్‌లోనూ కేవలం ఇద్దరు మహిళలు మాత్రమే ఉన్నారు. పురుషాధిక్యత, నిష్పక్షపాతం లేని జపాన్ రాజకీయ పార్టీల్లో మహిళా అభ్యర్థులను గుర్తించడం కష్టమని గత నెలలో పాలక పార్టీ నాయకత్వ ఓటుకు ముందు 'నో యూత్ నో జపాన్' సంస్థ అధినేత మొమోకో నోజో చెప్పారు. 2021లో నిర్వహించిన కేబినెట్ ఆఫీస్ సర్వేలో జపాన్‌లోని మహిళా అభ్యర్థులలో నలుగురిలో ఒకరు తమ ప్రచార సమయంలో లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నట్లు జిజి ప్రెస్ పేర్కొంది. ఆదివారం ఎన్నికల్లో ఇషిబా అధికార కూటమి ఘోరమైన పరిస్థితిని ఎదుర్కొంది. దీంతో పార్లమెంట్‌లో మెజారిటీని కోల్పోవచ్చని అంచనా. ఇషిబా అక్టోబర్ 1న ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సాధారణ ఎన్నికలు ప్రారంభమయ్యాయి. స్లష్ ఫండ్ కుంభకోణంతో ఆదివారం జరిగిన ఓటింగ్‌లో ఆయన లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ) ఆధిక్యతను కోల్పోయినట్లు మీడియా తెలిపింది.

భారతీయ అమెరికన్ల మద్దతు హారిస్‌కే

తాజా సర్వే వెల్లడి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం వాడీవేడిగా సాగుతోంది. తాజా సర్వేల్లో భారతీయ అమెరికన్ల మద్దతు డెమొక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్‌కే ఉందని వెల్లడైంది. 61 శాతం మంది భారతీయ అమెరికన్లు హారిస్ వైపే ఉన్నారని 'ఇండియన్ అమెరికన్ ఆటిట్యూడ్ సర్వే' వెల్లడించింది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు 31 శాతం మంది మద్దతు ఉందని తెలిపింది. యూగవ్, కార్నేగి ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ సంయుక్తంగా ఈ సర్వే నిర్వహించాయి. ఇండియన్ అమెరికన్ల మద్దతు హారిస్‌కే ఎక్కువగా ఉన్నప్పటికీ... ఇది డెమొక్రటిక్ పార్టీకి ప్రతికూల అంశమే. ఎందుకంటే... 2020 నాటి ఎన్నికల నాటితో పోల్చుకుంటే, డెమొక్రటిక్ అధ్యక్ష అభ్యర్థికి వారి మద్దతు తగ్గింది. అప్పట్లో జోబైడెన్‌కు 68 శాతం మంది అనుకూలంగా ఉన్నారు. అదే సమయంలో ట్రంప్‌నకు 22 శాతం మంది మాత్రమే మద్దతివ్వగా, తాజాగా ఆ సంఖ్య 31 శాతానికి పెరగడం గమనార్హం. డెమొక్రట్లుగా గుర్తింపు పొందే భారతీయ అమెరికన్ల సంఖ్య 56 శాతం నుంచి 47 శాతానికి తగ్గింది. అలాగే ఆ పార్టీ వైపు మొగ్గు చూపేవారి సంఖ్య 66 శాతం నుంచి 57 శాతానికి పడిపోయింది. అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడుతోన్న తొలి భారతీయ అమెరికన్ అయిన కమలకు ఈ గణాంకాలు ఆందోళన కలిగించేవే. ఇదిలాఉంటే... ఈ ఎన్నికల్లో భారతీయ అమెరికన్లు తీవ్ర ప్రభావం చూపనున్నారు. అమెరికాకు వలస వచ్చినవారిలో మెక్సికన్ల తర్వాత భారతీయులదే రెండో స్థానం. ఈ ఏడాది ఎన్నికల్లో భారతీయ అమెరికన్ల ఓట్లు కీలకంగా మారాయి. సంఖ్యాపరంగా చూస్తే ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్నా నానాటికీ భారతీయ అమెరికన్ల ప్రభావం పెరుగుతుండటంతో వారిని విస్మరించే పరిస్థితి లేదు. అందుకే రెండు ప్రధాన పార్టీలు వీరి ఓట్లు దక్కించుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలుచేస్తున్నాయి.

కుల గణన ఊసే లేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియ ప్రారంభం కాబోతున్నట్లు ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా వెల్లడించింది. ఇప్పటికే జనాభాలో చైనాను భారత్ దాటిపోయి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిందని గత ఏడాది ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. చివరిసారిగా 2011లో జనగణన చేపట్టారు. ఆ తర్వాత 2021లో జరగాల్సి ఉన్నప్పటికీ కోవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత జనగణనపై కేంద్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి. జనగణన జరగకపోవడం వల్ల ఆర్థిక డాటా, ద్రవ్యోల్బణం, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార నాణ్యతపై ప్రభావం పడుతున్నదని పలువురు ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. ఎట్టకేలకు దిగివచ్చిన ప్రభుత్వం జనగణన చేపట్టేందుకు సిద్ధమవుతోంది.

కలవరపాటు!

(మొదటిపేజీ తరువాయి)

యుగంలో సీసీ కెమేరాల నుంచి అన్నింటా భద్రతా చర్యలకు అవకాశం ఉంది. అలాంటి సమయంలో మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు రావడం పోలీసులకు అంతుచిక్కడం లేదు. సంకేతాలు వారికి అంతుచిక్కడం లేదు.

పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. బెదిరింపులకు గల కారణాలపై దృష్టి సారించి...అక్కడ ఏమీ లేదని గుర్తించింది. రాజధాని కేంద్రమైన విజయవాడ బందరురోడ్డులోని వివంతా హోటల్‌కు ఈనెల 27న మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు రంగంలోకి దిగి తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఏమీలేదని గుర్తించి వెనుతిరిగారు. హోటల్ యాజమాన్యం, అందులో బసచేసిన వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలోనూ అనేక హోటళ్లకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు తెలిసింది. మరో మూడు స్టార్ హోటళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు తెలిసింది. ప్రతి గదిని పోలీసులు తనిఖీలు చేసి బాంబు లేదని నిర్ధారించారు. ఈ బెదిరింపులపై పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తునకు సిద్ధమయ్యారు.

చిరంజీవికి ఏఎన్నార్ జాతీయ అవార్డు ప్రదానం

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తున్నట్లు అక్కినేని నాగార్జున ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా అవార్డు అందుకున్న చిరంజీవి భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమానికి అక్కినేని కుటుంబ సభ్యులు, అనేకమంది సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

ఏపీలో ఉచిత గ్యాస్‌కు రూ.895 కోట్లు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 31న ఉచిత సిలిండర్లను ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేయనుంది. మొత్తం మూడు ఉచిత సిలిండర్లకుగాను రూ.2,684 కోట్ల వ్యయమవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఉచిత సిలిండర్ నిధులను డీబీటీ ద్వారా జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

10 వేల మంది వలంటీర్లు: ఆతిశీ

(మొదటిపేజీ తరువాయి)

వీరి నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని, రానున్న నాలుగు నెలలు వీరు విధుల్లో ఉంటారన్నారు. బస్ మార్షల్స్‌గా పనిచేసిన ఈ వలంటీర్లను గత ఏడాది నవంబర్‌లో తొలగించారు. వాయునాణ్యత తగ్గుతున్న వేళ కాలుష్యం కట్టడికి నాలుగు నెలల పాటు వీరికి వివిధ పనులు అప్పగించాలని ఇటీవల జరిగిన దిల్లీ విపత్తు ప్రతిస్పందన సంస్థ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆ నేపథ్యంలో ఆతిశీ ప్రకటన చేశారు. 2015లో మహిళల భద్రత కోసం ప్రభుత్వ బస్సుల్లో బస్ మార్షల్ పథకాన్ని ప్రారంభించారు. అయితే 2023లో వారి మోహరింపునకు సంబంధించి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వారు ప్రకృతి విపత్తు సమయంలో మాత్రమే సేవలు అందించాలని, ట్రాన్స్‌పోర్టు విభాగంలో పనిచేయకూడదని రెవెన్యూ, ఫైనాన్స్ విభాగాలు వాదించాయి. దీంతో గత నవంబర్‌లో వారిని విధుల నుంచి తొలగించారు.

విధుల్లోకి బాలిమర్ ముఠా కార్మికులు: ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ సమీపాన రాయనపాడులో నూతనంగా నిర్మించిన బాలీమార్ అండ్ లారీకో ప్రైవేట్ లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటయిన కోల్డ్ స్టోరేజ్ కంపెనీలో రాయనపాడు సీడబ్ల్యూసీ ముఠా నుంచి పది మంది కార్మికులను విధుల్లోకి చేర్పించినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య తెలిపారు. నెల రోజుల నుంచి కంపెనీకి ముఠా కార్మికులకు కొనసాగుతున్న వివాదం మంగళవారం పరిష్కారమైందన్నారు. కంపెనీ యాజమాన్యం అక్కడి ముఠా కార్మికులను కాకుండా ఇతర ప్రాంతాల వారిని పనిలో చేర్చుకోవడానికి ప్రయత్నించిందని, దానిని ఏఐటీయూసీ నివారించి స్థానిక ముఠా కార్మికులకు అవకాశం కల్పించాలని గట్టిగా పోరాడటంతో యాజమాన్యం దిగివచ్చి రాయనపాడు కార్మికులకే అవకాశం కల్పించిందని వివరించారు. కార్మికులకు కనీస వేతనాలు చట్టం ప్రకారం ఇవ్వాలని, సామాజిక భద్రత కింద పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని, బోనస్, సెలవులు తదితర సౌకర్యాలు కల్పించాలని వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. స్థానికులకు అవకాశం కల్పించినందుకు ఆయన కంపెనీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద మేస్త్రి బసవయ్య, మేస్త్రి రామకృష్ణ, గ్రూప్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కల విద్యాసాగర్‌కు షాక్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సినీనటి కాదంబరి జెత్వానీ కేసులో కుక్కల విద్యాసాగర్‌కు హైకోర్టులో ఊరట లభించలేదు. విజయవాడ కోర్టు తనపై విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ ఇటీవల హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సోమవారం విచారించిన హైకోర్టు కుక్కల విద్యాసాగర్ అరెస్టు విషయంలో జోక్యానికి నిరాకరించింది. ఆయన వేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. కుక్కల విద్యాసాగర్‌ను అరెస్టు చేసే సమయంలో పోలీసులు చట్టనిబంధనల ప్రకారమే నడుచుకున్నారని అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టులో వాదించారు. విద్యాసాగర్‌ను అరెస్టు చేసి రాష్ట్రానికి తరలించేందుకు అనుమతి కోరుతూ ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని... కోర్టు ఇచ్చిన ట్రాన్సిట్ ఆర్డర్‌పై పిటిషనర్ సంతకం కూడా చేశారని తెలిపారు. దీంతో అరెస్టుకు కారణాలు చెప్పలేదని, పోలీసులు చట్టనిబంధనలు అనుసరించనందున రిమాండ్ ఉత్తర్వులు చెల్లుబాటు కావన్న విద్యాసాగర్ వాదనలో అర్థం లేదని దమ్మాలపాటి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు... విద్యాసాగర్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పును వెల్లడించింది.

రైతు భరోసా ఇవ్వండి

విశాలాంధ్ర-హైదరాబాద్: బ్యాంకు రుణాలు రెండు లక్షలున్నా... ఆ పైబడి ఉన్నా రుణమాఫీ వర్తింప చేయాలని, భూ హక్కు చట్టం త్వరితగతిన చేయాలని, సన్నరకంతో పాటు దొడ్డ రకం వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం పిలుపులో భాగంగా వరంగల్ జిల్లా రైతు సంఘం అధ్వర్యంలో సోమవారం ఏక్‌సిలా పార్క్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రైతులు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సంఘ రాష్ట్ర నేత పశ్య పద్మ మాట్లాడుతూ... క్వింటా మొక్కజొన్నకు రూ.330, కందులు రూ.400, సోయా రూ.450, పత్తికి రూ.475, చెరుకు రూ.850, జొన్నలకు రూ.380 బోనస్ ఇస్తామని చెప్పిన పాలకులు ఆచరణలో అమలు చేయటంలో వైఫల్యం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్న రైతుల ఆశలపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీళ్లు చల్లారన్నారు. వానాకాలం లో ఇవ్వమని చెప్పటంతో రైతులలో ఆందోళన పెరిగిందన్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారన్నారు. సకాలంలో రైతు భరోసా, రుణమాఫీ అమలు కాకపోతే ఆత్మహత్యలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శి వీరగోని శంకరయ్య మాట్లాడుతూ హామీలు అమలు చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పాష మాట్లాడుతూ ఆలస్యమైనా వానాకాలం, యాసంగి రెండు పంటలకు ఒకేసారి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వజ్రాల అరుణ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సాయిలు, శోభ, హసీనా, రాజారాం పాల్గొన్నారు.

పానుగంటి చైతన్య రిమాండ్ పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఏ1గా ఉన్న వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్యను ఏపీ సీఐడీ పోలీసులు సోమవారం కోర్టులో హాజరు పరిచారు. దీంతో ఆయనకు 14 రోజుల పాటు న్యాయమూర్తి రిమాండ్ పొడిగిం చారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయి గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చైతన్యను విచారణ నిమిత్తం ఏపీ సీఐడీ అధికారులు కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సోమవారం ఉదయం 11 గంటల వరకు చైతన్యను విచారించేందుకు సీఐడీ పోలీసులకు కోర్టు అనుమతించింది. సీఐడీ అధికారులు గుంటూరులో వైసీపీ నేతను తమదైన శైలిలో విచారించారు. చైతన్యను కోర్టు నుంచి విజయవాడ జైలుకు తరలించారు.

బుచ్చమ్మది ప్రభుత్వ హత్య

(మొదటిపేజీ తరువాయి)

పుస్తకాలైనా తీసుకుంటామంటే తీసుకోనివ్వలేదన్నారు. ఎక్కడ నా ఇల్లు కూలగొడుతారమోనని ఇళ్ల బుచ్చమ్మ (52) ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తంచేశారు. అనుమతులు ఇచ్చి, పన్నులు కట్టించుకొని వాళ్లే ఇల్లు కూలగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఇది ఆత్మహత్య కాదు... హైడ్రాతో సీఎం రేవంత్ రెడ్డి చేయించిన హత్య అన్నారు. వేదశ్రీ అనే పాప ఏడుస్తూ పుస్తకాలు తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా ఇళ్ల కూలగొట్టారని చెప్పారు. రేవంత్ రెడ్డీ... నీ అన్నకు ఎఫ్టీఎల్‌లో ఉన్న ఇల్లుకు నోటీసులిస్తారా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లు కడతాం, నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇస్తాం అన్నారు కానీ ఒక్క ఇళ్లు కట్టలేదు కానీ ఇళ్లు కూలగొట్టడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. పెద్ద పెద్ద బిల్డర్లను బెదిరించి చందాలు తీసుకోవడంపైనే ఈ ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తుందన్నారు. గరీబోళ్ల ఇళ్లు కూలగొట్టి హైడ్రా పేరుతో దందా చేస్తున్నారని మండిపడ్డారు. బాధితులందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయ పోరాటం చేస్తామన్నారు. హైదరాబాద్ ప్రజలు మాకు ఓటు వేసినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పగ, కసి పెంచుకుందని ధ్వజమెత్తారు.

ప్రత్యేక కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగం ఉండదన్నారు. పదేళ్లుగా ఈ సమస్య ఉందని, ప్రభుత్వాలు మారిపోతున్నా పరిష్కారం కావటం లేదన్నారు. పారదర్శకంగా పని చేయకపోవటం వల్లే విమర్శలు వస్తున్నాయన్నారు. నిబద్ధత కలిగిన విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరావు లాంటి అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తే సమస్య త్వరగా పరిష్కారం అవుతుందన్నారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులు అమ్మి బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికలలో మేనిఫెస్టోలో పేర్కొన్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్య మొదటిసారి వెలుగులోకి వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు 142 మందికి రూ.5లక్షలు పరిహారం అందించారని, కంపెనీ ఆస్తులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. తమ పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వం బాధితుల నిమిత్తం రూ.906 కోట్లు రెండు విడతలుగా ఇచ్చిందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఒక సమర్థవంతమైన అధికారులతో ప్రత్యేక కమిటీ (స్పెషల్ పర్పస్ వెహికల్)ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అధికారుల బృందం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తే బాధితులు వారి ఇబ్బందులను కమిటీ దృష్టికి తీసుకువస్తారని చెప్పారు. కంపెనీ అడ్డగోలుగా ఆస్తులు అమ్మేస్తుందని, మట్టి, కలప, వీల్కెనచోట బినామీ ఆస్తులను అమ్ముకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కంపెనీల ఆస్తులను పరిరక్షించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఏలూరు కోర్టులో ఉన్న 11వేల కేసుల్లో తమదీ ఒకటనీ ఈ సమస్య పరిష్కారం కోసం చాలా సంవత్సరాలు పట్టే అకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. బాధితుల పక్షాన ఏడు డిమాండ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వాయిదా తీర్మానం ఇచ్చి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని చెప్పారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీల తరుపున మద్దతు ప్రకటించారు.

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల డిమాండ్లను పరిష్కరించటానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేని అంశాలే ఉన్నాయని ప్రత్యేక దృష్టిపెడితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లడుతూ సమస్య పరిష్కారానికి బాధితుల్లో రాజకీయ చైతన్యం రావాల్సి ఉందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వేంకటేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని కుటుంబాల సమస్యగా ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలన్నారు. ఐక్యంగా పోరాటం చేస్తే ప్రభుత్వం దిగివస్తుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఒకేఒక్క లక్ష్యం కోసం పోరాటం చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులకు ఏఐటీయూసీ తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ మోసం చేసిన కంపెనీ ఆస్తులు అమ్మి సమస్యను పరిష్కరించాలని కోరటం న్యాయమైనదని, ఈ ప్రభుత్వ హయాంలోనే బాధితులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.తిరుపతి రావు అధ్యక్షత జరిగిన మహా విజ్ఞాపన దీక్షకు వివిధ రాజీకయ పార్టీలు, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.మల్లికార్జున్, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్‌తో పాటు 26 జిల్లాల నుంచి అగ్రిగోల్డ్ బాధితులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. దీక్ష సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలు ఆకట్టుకున్నాయి.

అగ్రిగోల్డ్ సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలం: వర్ల రామయ్య

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తెలిపారు. అడగకుండా అన్నం పెట్టే అయ్య చంద్రబాబు అని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా గత పది సంవత్సరాలుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు చేస్తున్న పోరాటాన్ని కొనియాడారు. కమ్యూనిస్టులు ముక్కు సూటిగా ఉంటారని, అవతలి వ్యక్తిని చట్టంలో ఎలా బిగించాలో తెలిసిన వ్యక్తుల్లో ముప్పాళ్ల ఒకరని చమత్కరించారు. చంద్రబాబు అనుమతితో వచ్చి మీకు హామీ ఇస్తున్నానన్నారు. మీ ఆవేదన, ఆకాంక్షకు తగినట్లుగానే ప్రత్యేక కోర్టుకు, ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు, అన్ని రాష్ట్రాలలో కేసులన్నీ ఏలూరు కోర్టు అనుమతి ఇచ్చేందుకు న్యాయశాఖ నిపుణులతో సంప్రదిస్తున్నామన్నారు. త్వరలోనే మీ కష్టాలు తీరుతాయని హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యర్ పర్యవేక్షణలో నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. బాధితులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మీ కుటుంబాలలో త్వరలోనే సంతోషాన్ని చూస్తారని ప్రకటించగా బాధితుల హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. అనంతరం దీక్షలో ఉన్నవారందరికీ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు.

ప్రజలపై విద్యుత్ భారాలు మోపితే సహించం: జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు మోపితే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ హెచ్చరించారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల జీవన పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉంటే మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలను మోపడం సమంజసం కాదని అన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని రాష్ట్ర ప్రజలకు వాగ్దానం చేసి, వామపక్ష, ప్రతిపక్ష పార్టీలతో కలిసి ఆనాడు విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించిన చంద్రబాబు నాయుడు తీరా అధికారంలోకి వచ్చాక ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రూ.8,114 కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపేందుకు సిద్ధమయ్యారని, నవంబరు మాసం నుంచి ఈ భారాలు వసూలు చేయడానికి విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిపాదించడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. తక్షణమే విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలని, లేనిపక్షంలో రాష్ట్రంలోని అన్ని పార్టీలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని, మరో విద్యుత్ ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

క్వింటా ధర రూ.7,521

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కాటన్ కార్పొరేషన్ అఫ్ ఇండియా (సీసీఐ) 2024-25 సీజన్‌కు చెందిన పత్తి కొనుగోలు కోసం నమోదును ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభించినట్లు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సోమవారం వెల్లడించింది. రైతులు వారి పంట వివరాలను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపింది. ఖరీఫ్ 2024-25 సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పత్తి కనీస మద్దతు ధరలు క్వింటాల్‌కు పొడవు పింజ రూ.7,521, పొట్టి పింజ రూ.7,121గా నిర్ధారించారు. సీసీఐ నాణ్యతా ప్రమాణాలు ఉన్నటువంటి పత్తినే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించింది. వ్యవసాయ, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు కర్నూలు మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారస్తులతో సమీక్షించి క్రయవిక్రయాలు గల ఉల్లిపాయలను వాహనాల ద్వారా త్వరగా బయటకు తరలించేందుకు చర్యలు తీసుకున్నట్లు మార్కెటింగ్ శాఖ వివరించింది. ఈ క్రమంలో సోమవారం కర్నూలు మార్కెట్ యార్డుకు 43,000 బస్తాల ఉల్లి క్రయవిక్రయానికి వచ్చాయి. ఈ-నామ్ నందు సాంకేతిక సమస్య పరిష్కారం కావడంతో క్రయవిక్రయాలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. మంత్రి అచ్చెన్నాయుడు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించి టెండరు విధానంలో నెలకొన్న సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

రహస్య జీవోలు ప్రజల ముంగిటకు

(మొదటిపేజీ తరువాయి)

సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సాధారణ పరిపాల శాఖ కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పారదర్శకత, సమాచారం నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసే అధికారిక ఉత్తర్వులు పౌరులకు అందుబాటులో ఉండాల్సిందేనని సాధారణ పరిపాల శాఖ స్పష్టం చేసింది. మూడేళ్ల కాలానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజలకు అందుబాటులో లేకపోతే సమాచార లోపం ఏర్పడుతోందని, రహస్య జీవోలను 2 నెలల్లో వెబ్‌సైట్‌లో ఉంచాలని ఆయా శాఖలకు సూచించింది. దీంతో జీవోఐఆర్ వెబ్‌సైట్‌ను అధికారులు పునరుద్ధరించటంతో పాటు పాత జీవోలన్నీ ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. 2008 నుంచి ఇప్పటివరకూ అన్నీ ప్రభుత్వ ఉత్తర్వులూ జీవోఐఆర్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 2021 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 28 మధ్య విడుదల చేసిన ఉత్తర్వులు వెబ్ సైట్‌లో పొందుపరచలేదు. ఉద్దేశపూర్వకంగానే గత జగన్ ప్రభుత్వం వ్యవహరించిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అనేక అక్రమాలు, తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు, ప్రతిపక్షాలను అణచివేసేందుకుగాను రహస్య జీవోలు విడుదల చేశారన్న విమర్శలున్నాయి. ఈ నిర్ణయంతో సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ సమాచారం ప్రజలకు ఇవ్వాల్సి ఉన్నందున జీవోలు వెబ్‌సైట్‌లో ఉంచితే దానికి సంబంధించిన దరఖాస్తులూ తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు. గడచిన మూడేళ్లలో ప్రజలకు అందుబాటులో లేని ప్రతి జీవోను జీవోఐఆర్ సైట్‌లో ఉంచాలని ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖకు ఆదేశాలు వెళ్లాయి. తాజాగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం వాటన్నిటినీ అప్‌లోడ్ చేసేలా ఆదేశాలు జారీజేయడంతో ఆయా జీవోల సారాంశాలు వెలుగు చూడనున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆయా జీవోల రూపంలో ప్రజలకు ఒక స్పష్టతనిస్తాయని, తద్వారా ఆర్‌టీఐ చట్టం ద్వారా వచ్చే దరఖాస్తులు తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడదామని ఎస్పీ రోహిత్ రాజు పోలీసులకు పిలుపు నిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా సోమవారం కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని ఐఎంఏ హాల్లో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం చేయడానికి ఎంతో ఆరోగ్యాకరమన్నారు. ఈ శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనడం స్ఫూర్తి నిచ్చిందన్నారు. ఈ శిబిరం ద్వారా 130 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీస్ అమరవీరులను ఎప్పటికీ మర్చిపోకుండా, నిత్యం గుర్తు చేసుకోవడానికి జిల్లాలో పోలీలు అనేక కార్యక్రమాలను నిర్వహించిన్నట్లు చెప్పారు. కార్యక్రమాలకు జిల్లా ప్రజల నుండి అనూహ్య స్పందన రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ తో పాటు సిఐలు, ఎస్ఐలను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి తోపాటు సీఐలు వెంకటేశ్వర్లు, శివప్రసాద్, ఇంద్రాసేనారెడ్డి, ఆర్ఐలు సుధాకర్, నరసింహారావు, కృష్ణారావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణ పరిధిలో 8క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి నేరేడుచర్ల పట్టణం రామాపురం రోడ్డు నందు వాహనాలు తనిఖీ చేస్తుండగా నేరేడుచర్ల, శివాజీనగర్‌కు చెందిన ఇంజమూరి సురేష్ తండ్రి శంభు లింగం అనే వ్యక్తి తన ఆటోలో ప్రభుత్వం పంపిణీ చేసిన పిడిఎస్ బియ్యాన్ని తన ఇంట్లో గల పిండి మిల్లు ద్వారా నూకలుగా మార్చి వాటిని కోళ్ల ఫారం వద్ద అమ్మటానికి వెళుతుండగా పట్టుకున్నారు. 16 బస్తాల్లో గల 8 క్వింటాళ్ల నూకలగా మార్చిన పిడిఎస్ బియ్యాన్ని AP 24x 3382 నెంబర్ గల ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఇంజమూరి సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొమురం భీం : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల ను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని గత ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర - వనపర్తి : త్వరలో ప్రారంభమయ్యే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, జిల్లా అధికారులు, తహాశీల్దార్లతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించడానికి ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 18 విడుదల చేయడం జరిగిందని, సర్వే కొరకు త్వరలో పూర్తిస్థాయి విధి విధానాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏ ఒక్క ఇల్లు, కుటుంబం వదలకుండా అన్ని కుటుంబాలు, ఇళ్ళు సర్వేలో నమోదయ్యే విధంగా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. 2011 సర్వే ప్రకారం ఉన్న ఎన్యుమరేషన్ బ్లాక్‌లను గుర్తించి వాటి ప్రకారం మున్సిపాలిటీ, గ్రామస్థాయిలో ఎన్యుమరెటర్‌లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కుటుంబ సర్వే పై మాస్టర్ ట్రైనర్‌లు త్వరలో మండల, గ్రామ స్థాయి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, ఆర్డీఓ పద్మావతి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్, తహాశీల్దార్లు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతతో రాజ్యాధికారం సాధ్యం

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : బీసీల కోసం మరో ఉద్యమం తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. సోమవారం దేవరకొండలో నిర్వహించే బీసీల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వస్తున్న ఆయనను కొండమల్లేపల్లి మండల బీసీ సంఘం ఆధ్వర్యంలో అన్ని కులాల నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎస్వీ కాంప్లెక్స్‌లోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు న్యాయం జరిగేలా మరో ఉద్యమం చేపట్టాలని, దానికి అందరి సహకారం కావాలన్నారు. నాటి నుండి నేటి వరకు అణగారిన బీసీ వర్గాల కోసం నిర్విరామ కృషి చేస్తున్నానన్నారు. బీసీల పిల్లలను ఉన్నతంగా చదివించి, ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని సూచించారు. బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్ గౌడ్, అబ్బనబోయిన శ్రీనివాస్ యాదవ్, గుండెబోయిన లింగం యాదవ్, కొడిదాల వెంకటయ్య, దుర్గయ్య, ఏరుకొండ రాము, శ్రీహరి గోపాల చారి, తోటపల్లి వెంకటయ్య, బొడ్డుపల్లి ముత్యాలు, ఏరుకొండ సైదులు, రవి, సత్యనారాయణ, చనగోని గణేష్, భూతరాజు దాసు, భూతరాజు లింగం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లక్ష్యాలు

నూరు శాతం పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ప్రభుత్వం వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షిస్తూ జిల్లా అధికారులు మండల ప్రత్యేక అధికారులుగా మండలాలలో ధాన్యం కొనుగోలు, పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పెండింగ్లో ఉంచవద్దని తెలిపారు. ఆయా శాఖలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నూటికి నూరు శాతం పూర్తిచేయాలని, ఒకవేళ ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మహిళా శక్తి, ఉపాధి హామీ, ఆయిల్ ఫామ్ తోటల పెంపకం వంటి వాటిపట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎప్పటి ఫైళ్లు అప్పుడే పరిష్కరించాలని, ఏ దశలోనూ జాప్యం చేయవద్దని, ఫైళ్ల పరిష్కారంలో పారదర్శకత ఉండాలని చెప్పారు. దరఖాస్తుల పరిష్కారాన్ని దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంచార జాతుల సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణలో భాగంగా నవంబర్ 4న బిసి కమిషన్ జిల్లాకు రానున్నదని, బీసీ కమిషన్ బృందం ఆరోజు ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి అలాగే అదే రోజు సాయంత్రం యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించి వివిధ సామాజిక వర్గాల వారు, ప్రజా ప్రతినిధులతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. తిరుమలగిరి సాగర్లో చేపట్టిన భూ సమస్యల పరిష్కార ప్రత్యేక ప్రాజెక్టు కింద ఇదివరకే నిర్దేశించిన లక్ష్యం ప్రకారం సర్వే, రికార్డుల పనులు పూర్తి చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర ,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు ప్రజావాణిలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కాగా ఈ సోమవారం మొత్తం (53) ఫిర్యాదులు రాగా, అందులో రెవిన్యూకు సంబంధించి (26) ఇతర శాఖలకు సంబంధించి (27) ఉన్నాయి.

రైతులను మోసం చేస్తే ప్రభుత్వాన్ని నీలదీస్తాం

రుణమాఫీ, రైతు భరోసా విషయంలో స్పష్టత ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర బ్యూరో - భద్రాద్రి కొత్తగూడెం : ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయగా తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఏఐకేఎస్ అనుబంధ రాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ లు హెచ్చరించారు. రైతాంగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్ల వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండు లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది కావస్తున్న మాఫీకి ఇంకా పూర్తి చేయలేదన్నారు. కంటి తుడుపుగా రెడు లక్షల లోపు రుణాలను అనేక నిబంధనలు విధించి పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఇప్పటి వరకు ఖరీఫ్, రబీ సీజన్లకు సంబందించిన రైతు భరోసా జమ చేయకుండా కాలాయాపన చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ పరిణామం పరోక్షంగా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టివేస్తోందన్నారు. తక్షణమే రైతు భరోసా జమ చేయకుంటే పెద్దఎత్తున ఆందోళను చేపడతామని హెచ్చరించారు. కొత్త రెవిన్యూ చట్టం ఏమైందని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహార ఇవ్వాలని డిమాండ్ చేసారు. కల్తీ విత్తనాలు విక్రయించిన అక్రమార్కులపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, కొమరి హన్మంతరావు, గుగులోత్ రాంచందర్, నరజాతి రమేష్, యాస రోశయ్య, ఇమ్మానియల్, ఏ సీతారామిరెడ్డి, బండి నాగేశ్వర్ రావు, ఇట్టి వెంకట్రావు, శనిగరపు శ్రీను, గిరి ఇరుకులపాటి సుధాకర్, విజయ్ మోహన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి

ఆలిండియా సర్వీసెస్ అధికారులకు కలెక్టర్ రాహుల్ రాజ్ సూచన

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : ఆలిండియా సర్వీసెస్ అధికారులు ఉద్యోగ జీవితంలో బాగా రాణించి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం ఐడిఓసిలో జిల్లాలో 26 మంది ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందం 8 రోజుల పర్యటన ముగింపు సందర్భంగా కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్థాయిలో నేర్చుకున్న అంశాలు అడిగి తెలుసుకున్నారు. తగు సూచనలు చేస్తూ ఉద్యోగి జీవితంలో అనుభవాలు ఉత్తమ పాలనకు దోహద పడతాయన్నారు. క్షేత్రస్థాయిలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని సరికొత్త అనుభూతినిస్తాయని చెప్పారు. మెదక్ జిల్లాలోని మనోరాబాద్ మండలంలో కుచారం, తూప్రాన్ మండలంలో మల్కాపూర్, నర్సాపూర్ పరిధిలో అవంచ, రామాయంపేట పరిధిలో డి.ధర్మారం గ్రామాల్లో పర్యటించారు. విద్యా, వైద్యం, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, ఉద్యానవనం, పథకాల తీరు, ప్రజల జీవన స్థితిగతులు, ఆర్థిక అంశాలు, అవగాహన పెంపొందించుకోవడం చాలా సంతోషమన్నారు. మెదక్ జిల్లా క్షేత్రస్థాయి పర్యటన ఎంతో సంతృప్తిని సంతృప్తినిచ్చిందని ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలిండియా సర్వీసెస్ అధికారులను మెమెంటోలు, శాలువాలతో కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ మండల కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర (మహబూబాబాద్) దంతాలపల్లి : మండల నూతన ప్రెస్‌క్లబ్ కమిటీని ఏకగ్రీవ ఎన్నుకున్నారు. దంతాలపల్లి మండలంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం టీజేఏ జిల్లా అధ్యక్షులు పంతం సురేందర్ ముఖ్య అతిథి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల అందరి సమక్షంలో ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండవ సారి ఏకగ్రీవంగా అధ్యక్షులుగా చిల్ల నిరంజన్‌ని ఎనుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఊడుగుల ఐలేష్ యాదవ్, గౌరవ అధ్యక్షులుగా గుల్ల గట్టు దాసు, పంతం సురేందర్, ఉపాధ్యక్షులు అనపర్తి వీరన్న,కోశాధికారి మార్క వెంకన్న, సహాయ కార్యదర్శి పంతం విజయేందర్, కార్యదర్శి మిడతపల్లి సురేందర్, కార్యవర్గ సభ్యులు కొండ వెంకన్న, గౌరవ సలహాదారు భూపతి కాశయ్య,కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చిల్ల నిరంజన్ మాట్లాడుతూ రిపోర్టర్లు అందరూ ఐక్యమత్యం తో ఉన్నప్పుడు మాత్రమే మన సంఘం అభివృద్ధి జరిగి,మన హక్కుల కోసం పోరాడి సాధించుకోవచ్చు అని అన్నారు. ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరి ధన్యవాదాలు తెలిజేశారు.అలాగే జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతు, కలం కార్మికులందరికి న్యాయం చేకూరేలా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ఐజేయు జిల్లా నాయకులు ఏ.అశోక్, కృష్ణ, కార్యవర్గ సభ్యులు కొండ వెంకన్న, పాల్గొన్నారు.

పేదల గుడిసెలను క్రమబద్ధీకరించి పట్టాలివ్వాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : పేదలు నిర్మించుకున్న గుడిసెలను క్రమబద్ధికరించి ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కురవి గ్రామ శివారులోని గుడేస వాసుల, సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి కావస్తున్న పేదలకు రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వకుండా తాత్సర్యం చేయడం సబబు కాదని హితవు పలికారు. సిపిఐ ఆధ్వర్యంలో సంవత్సర క్రితం పేదలు తిర్లపురం రెవిన్యూ శివారు అసైన్మెంట్ భూమిలో వేసుకున్న ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించి పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయాలని కోరారు. అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్లను, రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందేలా గ్రామసభలు నిర్వహించి పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, కూర్యాల వీరన్న, మధు, మల్లమ్మ, అచ్చమ్మ, జానకి, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబిటస్ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలి

తొలిపొద్దు - సిద్దిపేట ప్రతినిధి : అంధుల కోసం అంబిటస్ విద్యార్థులు చేపట్టిన బృహత్తర కార్యక్రమం సమాజంలో ఎందరికో స్ఫూర్తిని కలిగించాలని సిద్దిపేట ఏసిపి మధు అన్నారు. ఐటీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంధుల కోసం హైదరాబాదులో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణం కోసం అంబిటస్ విద్యార్థులు సేకరించిన 1 లక్ష 7,500 రూపాయల విరాళాల చెక్కును ఫౌండేషన్ ప్రతినిధులకు సోమవారం ఏసిపి మధు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎసిపి మాట్లాడుతూ సమాజంలో అంగవైకల్యంతో బాధపడే వారికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి వ్యక్తి తన జీవితకాలంలో సంపాదించిన సంపదను 10 శాతం కూడా సేవా కార్యక్రమాలకు ఖర్చు పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం పట్ల అవగాహన కలిగిన వారు అంధులను ఆదుకునేందుకు కృషి చేయాలన్నారు. అంబిటస్ విద్యార్థులు చేపట్టిన బృహత్తర కార్యక్రమం ఎందరికో స్ఫూర్తిని కలిగించాలని కోరారు. చక్కటి కార్యక్రమానికి తోడ్పాటు అందించిన స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. స్కూల్ కరస్పాండెంట్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తమ పాఠశాల విద్యార్థులు, మేనేజ్మెంట్ ముందుంటారన్నారు. సంస్థ భవన నిర్మాణానికి విరాళాలిచ్చి ఇతోధికంగా సహకరించిన పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎడ్ల జ్యోతి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ విజయ్ భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ని ముందస్తు సమాచారం కోరిన సీనియర్ జర్నలిస్టు

విశాలాంధ్ర - వనపర్తి : ప్రభుత్వం తరపున అధికారులు నిర్వహించే కార్యక్రమాల గురించి ముందస్తు సమాచారం మీడియాకు అందించాలని సీనియర్ జర్నలిస్టు బాలస్వామి మల్యాల జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల నిర్వహణ అనంతరం డి పి ఆర్ ఓ ద్వారా సమాచారం ఇచ్చినప్పటికీ సమగ్రమైన వార్తను అందించేందుకు వీలు పడడం లేదు కనుక ముఖ్యమైన కార్యక్రమాల గురించి ముందస్తు సమాచారం ఇప్పించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కొత్తగూడెం : బాబు క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూరుగు నీరజ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ నాయకులు నాగ సీతా రాములు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలు, మైనార్టీల తోపాటు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తూ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వంలో, అభివృద్ధి కార్యక్రమాల్లో కీలక భూమి పోషిస్తున్న ముఖ్య నాయకుడుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎదిగారని తెలిపారు. ఆయన జన్మ దినాన్ని పురస్కరించుకుని పాఠశాలలో మొక్కలు నాటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మొక్కల రాజశేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు షేక్ దస్తగిరి, సునందిని, రమాదేవి, స్టెల్లా, రాజేశ్వరి, సీతా, సౌందర్య, వేంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి : డీఎస్పీ రెహమాన్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : చెకుముకి సైన్స్ సంబురాలు విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని, జిజ్ఞాసను పెంచుతాయని కొత్తగూడెం డిఎస్పీ అబ్దుల్ రహమాన్ తెలిపారు. చెకుముకి సైన్స్ గోడ పత్రికను డిఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పరీక్షల్లో పాల్గొనడం వల్ల నిత్యజీవితంలో సైన్స్ వల్ల ఉపయోగాలు, ఆవశ్యకతను తెలియజేస్తాయన్నారు. జానవిజ్ఞాన వేదిక రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆలోచించడంలో పరిజ్ఞానం పెరుగుతుం దన్నారు. భావి సమాజ నిర్మాణానికి శాస్త్రీయ విజ్ఞానం చాలా అవసరమన్నారు. ప్రముఖ ఉపాధ్యాయులు దస్తగిరి మాట్లాడుతూ సైన్స్ నిత్యజీవితంలో ఒక భాగమైపోయిందన్నారు. అధ్యక్షులు వీరభద్రం మాట్లాడుతూ గత 33 సంవత్సరాల జెవివి ద్వారా చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐ శివ ప్రసాద్, మొక్కల రాజశేఖర్, పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలి : ఎస్పీ రోహిత్ రాజు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేసే స్మగ్లర్ల పై పోలీసులు ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్పష్టం చేసారు. సోమవారం ఆయన బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. వర్టికల్స్ వారీగా ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు నిత్యం పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి సతీష్ కుమార్, సీఐ వినయ్ కుమార్, ఎస్సైలు రాజేష్, నాగబిక్షం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఒకే సమస్యపై ప్రజలు మళ్లీమళ్లీ దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటివరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించి నప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని, దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. సోమవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 39 దరఖాస్తులు అందాయని తెలిపారు.

సంపాదకీయం

రాజకీయ డిస్కో డాన్సర్

బెంగాల్ శాసనసభ ఎన్నికలకు ఇంకా దాదాపు రెండేళ్ల సమయం ఉంది. కానీ ఎన్నికల విషయానికి వచ్చేసరికి బీజేపీకి జాగ్రత్త ఎక్కువ. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అప్పుడే మమతా బెనర్జీ మీద నిప్పులు కురిపిస్తున్నారు. అంటే షా నోరు ఎప్పుడూ పెద్దదే. కాబట్టి మమతా బెనర్జీ మీద ఆయన ఘాటైన భాషలో విమర్శలు గుప్పించడాన్ని అర్థం చేసుకోవచ్చు. ఈ అరుపులవల్ల బీజేపీకి ఒరిగేది ఏమీ లేదని రెండు మూడు ఎన్నికల్లో రుజువైంది. మమతా బెనర్జీని గద్దె దించడమే బీజేపీ తక్షణ కర్తవ్యంగా కనిపిస్తోంది. ప్రసిద్ధ సినిమానటుడు మిథున్ చక్రవర్తి ఇప్పుడు అమిత్ షాను తలదన్నేట్టు మమతా బెనర్జీ మీద విరుచుకు పడ్తున్నారు. 2021లో బీజేపీలో చేరకముందు మిథున్ చక్రవర్తి తృణమూల్ కాంగ్రెస్ తరపున రాజ్యసభ సభ్యుడిగా ఉండేవారు. 2014లో తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ ఆయనను రాజ్యసభకు పంపిస్తే రెండేళ్లకే రాజీనామా చేశారు. మళ్లీ సినిమా లోకంలో కొన్నేళ్లు పనిచేసి 2021 మార్చి ఏడున భారతీయ జనతా పార్టీలో చేరిపోయారు. ఇప్పుడు ఆయన బీజేపీలో ఉన్నారు కనక ఎంత గట్టిగా అరిస్తే జనం తనను అంతగా గుర్తుపెట్టుకుంటారు అనుకుంటున్నట్టున్నారు. బెంగాల్‌లో శాసనసభ ఎన్నికల్లో ఇంకా వ్యవధి ఉండొచ్చు కానీ వచ్చే నెలలో అక్కడ ఆరు శాసనసభా స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అందుకే అమిత్ షా వాతావరణాన్ని వేడెక్కించే ప్రయత్నంలో మునిగిపోయారు. మిథున్ చక్రవర్తి కూడా అమిత్ షాతో కలిసి కొన్ని సభల్లో మాట్లాడారు. అమిత్ షాను మించిన నోటి దురుసు ప్రదర్శించారు. తృణమూల్ నాయకుడు హుమాయూన్ కబీర్ ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రత్యర్థి పార్టీల వారి మీద దౌర్జన్యం రెచ్చగొట్టే రీతిలో మాట్లాడారట. ఆయన తృణమూల్ నాయకుడు కనక ఎన్నికల కమిషన్ అభిశంసించింది. అదే మోదీ లాంటి నాయకుడు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా ఎన్నికల కమిషన్ కళ్లు మూసుకునే ఉంటుంది. హుమాయూన్ కబీర్ ప్రత్యర్థి పార్టీ వారిని భాగీరథి నదిలో పడేస్తానన్నారట. దీన్ని అసరగా చేసుకుని మిథున్ చక్రవర్తి తృణమూల్ కాంగ్రెస్ తలలు నరికేస్తానంటున్నారు. భాగీరథి నది పవిత్రమైంది కనక వారి శవాలను అందులో పడేయకుండా పాతి పెడ్తాం అంటున్నారు. హుమాయూన్ కబీర్ మాటలు మర్యాదను అతిక్రమించి ఉండొచ్చు. అది కచ్చితంగా అభ్యంతరకరమైందే. కానీ మిథున్ చక్రవర్తి అంతకన్నా రెచ్చగొట్టే భాషలో మాట్లాడారు. హింసను ప్రేరేపించే రీతిలో మాట్లాడారు. బహుశా ఆయన మాటలు అమిత్ షాను కూడా ఆశ్చర్యపరచి ఉండొచ్చు. ప్రత్యర్థుల తలలు నరికి వారి శవాలను పాతిపెడ్తాననడం ఏ లెక్కన చూసినా ఆమోదయోగ్యమైన భాష కాదు. ఇది కచ్చితంగా జనాన్ని రెచ్చగొట్టే ప్రయత్నమే. 2026లో బెంగాల్‌లో విజయం సాధించడానికి ఏమైనా చేస్తాం అని మిథున్ చక్రవర్తి కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమక్షంలోనే చెప్పారు. అమిత్ షా ఈ దుర్భాషను ఆపే ప్రయత్నం ఏం మాత్రం చేయలేదు. లోలోన సంతోషించే ఉంటారు. మిథున్ చక్రవర్తి తనను మించిపోయాడే అన్న బాధ అంతరాంతరాల్లో ఉండే ఉంటుంది. పైగా అమిత్ షా ఉండగానే చెప్తున్నాను 2026 శాసనసభ ఎన్నికలలో గెలవడానికి మేం ఏమైనా చేస్తాం, దేనికైనా సిద్ధమే అని మిథున్ చక్రవర్తి రెట్టించిన స్వరంతో హెచ్చరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సభలో అమిత్ షా సమక్షంలోనే మిథున్ చక్రవర్తి తెగ రెచ్చిపోయి మాట్లాడారు. బీజేపీలో చేరాలని జనాన్ని కోరారు. "మాకు పోరాడే వారు కావాలి. డబ్బు సంపాదించడం కోసం బీజేపీలో చేరేవారు అక్కర్లేదని మిథున్ అన్నారు. మీరు మాలో ఒక్కరికి హాని చేస్తే మేం మీవాళ్ల నలుగురికి హానీ చేస్తామని మిథున్ తీవ్రమైన కక్ష సాధింపు భాషలో మాట్లాడారు. ఆయన ఈ మాటలు అంటున్నప్పుడు అమిత్ షా నిశ్చేష్టంగా చూస్తూ ఉండి పోయారు. ఇదే సభలో మాట్లాడిన అమిత్ షా "రవీంద్ర సంగీతం వినిపించవలసిన రాష్ట్రంలో బాంబుల మోత వినిపిస్తోంది" అని సాధ్యమైనంత అతిశయోక్తి గుప్పించారు. బెంగాల్‌లో ప్రభుత్వ మద్దతుతో చొరబాట్లు జరుగుతున్నాయట. ఈ చొరబాట్లు ఆగాలంటే 2026 శాసనసభ ఎన్నికలలో బీజేపీని గెలిపించడం ఒక్కటే మార్గమట. వచ్చే శాసనసభ ఎన్నికలలో బీజేపీ మూడింత రెండువంతుల సీట్లు సాధిస్తుందట. తమ పార్టీ విజయం మీద ఆ పార్టీ నాయకులకు వల్లమాలిన విశ్వాసం ఉండడంలో తప్పు లేకపోవచ్చు. ఆ లక్ష్య సాధన కోసం తలలు నరుకుతాం, ఆ శవాలను పూడ్చి పెడ్తాం అనడం జనం మీద బొత్తిగా విశ్వాసం లేకపోవడమే కారణం. తమ విధానాలను, లక్ష్యాలను వివరించి ఓట్లు సంపాదించే హక్కు ఏ రాజకీయ పార్టీకైనా ఉంటుంది. కానీ ప్రత్యర్థి పార్టీ వారి తలలు నరికేస్తామనడం కచ్చితంగా గూండాల భాషే. ఈ భాష బీజేపీకి చాలా ఏళ్ల కిందే ఒంటబట్టింది. వారికన్నా తానేమీ తక్కువ తినలేదని నిరూపించడానికి మిథున్ చక్రవర్తి తంటాలు పడడమే ఆశ్చర్యంగా ఉంది. 74 ఏళ్ల మిథున్ చక్రవర్తి అనుభవ శూన్యుడేమీ కాదు. ఇంతకు ముందు ఆయనకు రాజ్యసభ సభ్యుడిగా రాజకీయ అనుభవం ఉంది. అప్పటి నుంచి లెక్కేసినా ఆయన అనుభవం దశాబ్దం దాటింది. అన్నింటికన్నా మించి సినిమా నటుడిగా ఆయనకు పలుకుబడి ఉంది. యాభై ఏళ్లపాటు రాజ్‌కపూర్‌ను రష్యా ప్రజలు అమితంగా ఆదరించారు. ఆ తరవాత రష్యా ప్రజల అభిమానాన్ని చూరగొన్నది మిథున్ చక్రవర్తే. తమకు రాజకీయంగా బాగా ఉపయోగపడుతున్నందుకు బీజేపీ ప్రభుత్వం ఆయనకు తక్కువేమీ చేయలేదు. ఈ ఏడాదే ఆయనకు పద్మవిభూషణ్ ఇచ్చి మోదీ ప్రభుత్వం కృతజ్ఞత చాటుకుంది. దానికి తోడు 2022వ సంవత్సరానికి మిథున్ చక్రవర్తికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ఇచ్చారు. అయితే ఆ విషయం గత సెప్టెంబర్ లోనే అధికారికంగా ప్రకటించారు. మిథున్ చక్రవర్తికి సినిమా నటుడిగా దక్కాల్సిన గౌరవాదారాలు దక్కాయి. మొట్ట మొదటి సినిమాతోనే జాతీయ అవార్డు సంపాదించారు. మూడు జాతీయ అవార్డులు సంపాదించారు. నాలుగు సార్లు ఫిలింఫేర్ అవార్డులు వచ్చాయి. మిథున్ చక్రవర్తి రాజకీయాలలో కూడా సంధానకర్తగా ఉండే అనుభవం సంపాదించారు. 2012లో ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతి పదవికి పోటీ చేసినప్పుడు మమతా బెనర్జీ మద్దతు సమకూర్చడానికి మధ్యవర్తిత్వం నెరపింది మిథున్ చక్రవర్తే. సినిమా రంగంలో మిథున్ అనేక ఎగుడు దిగుళ్లు ఎదుర్కొని నిలదొక్కుకున్నారు. సినిమా పరిశ్రమలో పని చేసే కార్మికుల సంక్షేమానికి కూడా ఆయన పాటుపడ్డారు. కానీ రాజకీయ తృష్ణ తీరినట్టు లేదు. రాజకీయాలలో డిస్కో డాన్సర్ ఎత్తులు ఆట్టే ఫలించవు.

తాత్పర్యరహిత టిప్పణి

చింతపట్ల సుదర్శన్

వెండి పళ్లెం ముఖానికి అడ్డం పెట్టుకుని సూరీడు తళతళలాడ్తున్నాడు. మైదానం ఖాళీగా నోరు తెర్చుకుని ఉంది. మైదానం చివర కూలిన కొంప అరుగు వాస్తవ్యుల్లో ఒకరైన డాంకీ కడుపులో ఆ పూట తిన్న కాగితాల్ని (గ్రైండర్‌లో వేసి ముద్ద చేస్తుంటే హాయిగా కునుకు తీస్తున్నది. అరుగుమీద మరో మూలన ఉన్న డాగీ అరుపులంకించుకోవడంతో ఉలిక్కిపడి లేచింది డాంకీ. ఎప్పుడు చూసినా నోరు పారేసుకునే రాజకీయ నాయకుడి మల్లే దీని అరుపు ఒకటి. ఎప్పుడూ ఎందుకు అరుస్తుందో అర్థంకాదు అనుకుంటూ నిద్ర లేచింది డాంకీ.

ఏమైంది నీకు. కొంపలు కూల్చే 'హైడ్రా' వాడు రెస్టు తీసుకుంటున్నాడు గదా. బఫర్ జోన్‌లో కొంప కూలుస్తున్నవాడిలా ఏమిటా అరుపు, కేకలు అంది డాంకీ. కొంప కూలడం కాదు, మనుషులకైతేనేం, కుక్కలకైతేనేం జాతి లక్షణం ఒకటి ఉండేడుస్తుంది కదా. సరే! దేనికేడుస్తున్నావో అది చెప్పు ముందు అంది డాంకీ. నేనిలా అరుగు ఎక్కి కునుకు వేద్దామని అనుకుంటుండగానే ఓ సన్నాసోడు అరుగు ఎక్కాడు. దొంగ ఎవడైనా మారువేషంలో వచ్చాడేమోనని అరిచా. నీ అరుపులు పడలేక వాడెవడో కాలికి బుద్ధి చెప్పే ఉంటాడు కదా అంది డాంకీ. ఊహూ అక్కడే ఉన్నది తిరకాసు. నేను అరచి గీ పెడ్తుంటే మిలట్రీవాడిలా స్ట్రయిట్‌గా నిలబడి నావైపు సూటిగా చూస్తూ చిరునవ్వు నవ్వాడు. అయితే పిచ్చోడే అయి ఉంటాడు. నువ్వు కరిస్తే బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు తీసుకోవాలన్న భయంలేనివాడు నిజంగా పిచ్చోడు కాక మంచోడవుతాడా అంది డాంకీ.

ముఖాన ఇంగ పెద్ద బొట్టు, నెత్తి మీద చుట్టలు చుట్టిన జుట్టు గడ్డం

రంగస్థలం

మీసాల మధ్య కనిపించకుండా ఉన్న నోరు ఆడు మామూలోడు కాదేమో డాంకీ. నన్ను చూసి పిక్కబలం చూపించకుండా ఇంటి లోపలికి వెళ్లిపోయేడు. అసెంబ్లీకి కొత్తగా ఎన్నికయినవాడు ప్రమాణం చెయ్యడానికి వెళ్లినట్టు దర్జాగా అంది డాగీ. అవునా! సన్యాసి అంటే ఏరకం సన్యాసి. రకరకాల వాళ్లంటారు కొందరిని బైరాగులంటారు కొందరిని నాగ సాధువులంటారు కొందర్ని అఘోరాలంటారు. ఎర్ర బట్టలా, కాషాయమా, తెల్లటి తెలుపా, గోచీనా అసలేమీలేదా? ఇన్ని రకాల సాధు సన్యాసులు, ఇన్ని రకాల వేషాలు ఉంటాయా నాకు మాత్రం అందరూ దొంగల్లానే కనపడ్తారు అందుకే భవ్వుమన్నా అంది డాగీ. అయినా ఆ బైరాగోడు నీ అరుపులు ఖాతరు చెయ్యకుండా లోపలికి వెళ్లాడన్న మాట. ఏం చేస్తున్నాడో లోపల అంటూ తొంగి చూసింది డాంకీ. లోపల్నించి దట్టమైన పొగలు వస్తున్నాయి. అర్థమైంది డాగీ వీడెవడో గంజాయి దమ్ము బైరాగి లాగున్నాడు. దమ్ము లాగిస్తున్నాడు. గంజాయి దమ్ములాగేటోడు మన కొంపలోకే రావాలా ఇదేం 'యోయో' గది కాదు గదా అడ్డమైన పన్లు చేసి చక్కాపోడానికి అంది డాగీ.

పాపం పోనీలెద్దూ. ఉంటానికీ, తింటానికీ ఠికాణా లేనోడు. ఇలాంటి వాళ్లకి పార్మ్‌హౌజ్‌లూ, రేవు పార్టీలూ, ఫారిన్ మందూ, కొకైనూ ఎవరిస్తారు చెప్పు. మాజీ మంత్రులకూ, రాజకీయ నాయకులకూ, బడా బాబులకూ ఉన్న 'ఫెసిలిటీస్' అందరికీ ఉండవు కదా. అవును నువ్వన్నది నిజమే నేను చూసిన సాధువు ఒంటి నిండా బూడిద ఉంది కాని ఒంటిమీద బట్ట లేనట్టుంది. నా అరుపులు పట్టించుకోకుండా లోపలికి వెళ్తుంటే ఏమీ చెయ్యలేకపోయా అంది డాగీ. హిమాలయాల్లో తిరిగి మంత్రాలేమైనా నేర్చుకుని వచ్చినవాడేమో నిన్ను పిల్లినీ నన్ను గుర్రాన్నీ చెయ్యగలడేమో సుమా మన పాత్రలే మనకు అలవాటైనయి మరో 'రోల్' లో రాణించలేం అంది డాంకీ.

లోపల్నించి గంజాయి పొగ బయటకు వచ్చింది. దానితో పాటు బైరాగీ బయటకు వచ్చాడు. డాగీ ఓ పక్కా డాంకీ ఓ పక్కా వినయంగా నిలబడ్డవి. విరిగిన తలుపునకు ఎదురుగ్గా రాయి మీద కూచుని తాపీగా అడిగాడు బైరాగి ఆఫ్టరాల్ ఊరకుక్కవి అల్సేషన్‌లా అరిచావేం నన్ను చూసి అని. సారీ! స్వామీ తమరెవరో తెల్సుకోలేని అజ్ఞానిని అంది. మనిషి భాషలో మాట్లాడ్తున్నావు ఇది నా మహిమేనన్న మాట. గాడిదగారూ తమరూ...చిత్తం నేనూ కొంత భాష తెల్సిన దాన్నే అంది డాంకీ. స్వామీ ఇందాక నేను అరిచిన అరుపులకు వేరొకరయితే పారిపోయేవారు. తమరు మాత్రం తొణక్కుండా, బెణక్కుండా లోపలికి దయచేసేరు తమరికి మాయలూ, మంత్రాలూ చాలా తెల్సుననుకుంటా అంది డాగీ.

అప్పుడే అరుగు ఎక్కిన అబ్బాయి బైరాగిని చూసి అడుగు వెనక్కు వేసి నమస్కరించాడు. ఇక్కడెక్కడో ఏదో గుళ్లో విగ్రహం ధ్వంసం చేశారని హిమాలయాల నించి వచ్చింది తమరేనా స్వామీ అన్నాడు. అవును మేమే. సనాతన ధర్మాన్ని ఉద్ధరించడానికి సన్యాసులమూ, సాధులమూ, బైరాగులమూ దేశం మీద పడ్డాం. అపచారం జరిగితే సహించం అన్నాడు ఒళ్లంతా బూడిద ఉన్న బైరాగి. తమరికి అనేక మాయలూ, మంత్రాలూ వచ్చి ఉండాలి అన్నాడు అబ్బాయి, సన్యాసి వైపు గౌరవంగా చూస్తూ. నాకంటే ఎక్కువ మీ నాయకులకీ, మాజీలకీ తెల్సునబ్బాయీ. పదేళ్ల కింద పైసా లేనివాళ్లు ఇప్పుడు కోట్లకి అధిపతులెలాగయ్యారు అంతా 'జగన్మాయే కదా'. వాళ్లకు తెలిసిన మంత్రతంత్రాలు మాకు తెలియవులే! ఏదో మానవులను ఉద్ధరించడానికి ఒంటి మీద బట్టలు లేకుండా తిరిగే బైరాగులం. ఇవ్వాళ ఇక్కడ రేపు బదరీ ఆపైన అయోధ్య కాదంటే సరయూతీరం అవునన్నా కాదన్నా కుంభమేళా అంతే అన్నాడు బైరాగి. ట్రైన్లో టికెట్టు లేకుండానే వెళ్తారా స్వామీ అంది డాగీ అమాయకంగా. మూర్ఖ శునకమా మేం గాలిలో ఎగిరిపోతాం బస్సులూ, రైళ్లూ, విమానాలూ ఎక్కం అన్నాడు కోపంగా బైరాగి.

అడవి జంతువులు దారి తప్పి ఊళ్లోకి వచ్చినట్టు, అడవులూ, కొండలూ వదిలి జనంలోకి ఎందుకు స్వామీ వచ్చి కలగజేసుకుంటున్నారు. మనుషుల సమస్యలు మనుషులు పరిష్కరించుకుంటారు కదా అన్నాడు అబ్బాయి.

టీవీలో, యూట్యూబుల్లో కనిపించి మీ తపశ్శక్తిని వేస్టు చేసుకోకండి స్వామీ, గంజాయి పీలుస్తూ హాయిగా గుహల్లో ఉండరాదూ అంది డాంకీ.

జెఎన్‌యులో చరిత్ర వక్రీకరణ

కృష్ణ ఝా

దిల్లీ జవహర్‌లాల్ విశ్వవిద్యాలయంలో 'అఖండ్ భారత్' భావజాలాన్ని బోధించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కొత్త అంశాన్ని బోధించే క్రమంలో ప్రణాళికను రూపొందిస్తున్నారు. దేశవ్యాప్తంగా అనేక వక్రీకరణలతో 'విద్యా భారతి' సంస్థ కింద వందలాది పాఠశాలలను ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తోంది. వీటిలో వక్రీకరణలను చిన్న వయస్సు వారికే బోధిస్తున్నారు. పాఠశాలల్లో, కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో చరిత్ర వక్రీకరణలను విద్యార్థుల మనస్సులో నింపేందుకు రహస్యంగా చాలాకాలంగా ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. దక్షిణాసియా ప్రాచీన భౌగోళిక రాజకీయ చరిత్రను వక్రీకరించారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని 'బంచ్ ఆఫ్ థాట్స్' రచనలో ఎంఎస్ గోల్వాల్కర్ నింపారు. దక్షిణాసియాలో ప్రాచీన భౌగోళిక రాజకీయాల చరిత్రను కూడా బంచ్ ఆఫ్ థాట్స్‌లో వక్రీకరించారు. ఈ భావజాలాన్ని ఆర్ఎస్ఎస్ నడిపే 'ఆర్గనైజర్', 'పాంచజన్య' పత్రికలలో పొగుడుతూ ప్రచారం సాగిస్తున్నారు. సంఘ్‌పరివార్ వక్రీకరణను నిరంతరం ప్రచారంలో పెట్టారు. కొత్తగా నిర్మించిన పార్లమెంటులో వక్రీకరణలతోకూడిన కుడ్య చిత్రణను చిత్రించారు. అఖండ్‌భారత్ చిత్రం గత సంవత్సరం మన దేశానికి చాలా ఇబ్బంది కలిగించింది. మన పొరుగుదేశాలు పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్ మన ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. 'అఖండ్ భారత్' చిత్రం ప్రధానమైన దౌత్య సంక్షోభంగా తయారైంది. దీనికి కేంద్ర విదేశాంగ శాఖ వివరణ ఇచ్చింది. ఆఖండ్ భారత్‌కు, చిత్ర పటానికి సంబంధంలేదని విదేశాంగశాఖ వివరణ ఇచ్చింది.

అఖండ్ భారత్ మీద పాఠ్యాంశాలను బోధించాలని జేఎన్‌యూపై ఒత్తిడిచేసి అమలు చేస్తున్నారు. దిల్లీ యూనివర్సిటీలోనూ అభూత కల్పనలను చరిత్రగా విద్యార్థులకు బోధించాలని సంఘ్‌పరివార్‌కు అనుకూలంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఈ నెల ప్రారంభంలో దిల్లీ యూనివర్సిటీలో చరిత్ర పాఠ్యాంశాలలో 'కొన్ని శతాబ్దాలలో నిర్మాణమైన ఢిల్లీ:' ఆధునిక చరిత్రలో 'చరిత్రతో సంబంధంలేని భావనలను చేర్చారు. అంతేకాదు, సుప్రసిద్ధ చరిత్రకారులు ప్రొఫెసర్ ఇర్ఫాన్‌హబీబ్ రచించిన అత్యంత ప్రధానమైన వ్యాసాన్ని తొలగించివేశారు. ఈ మార్పులను వ్యతిరేకిస్తూ దిల్లీ యూనివర్సిటీలో అనేకమంది లెక్చరర్లు తీవ్ర నిరసనలు తెలిపారు. చరిత్రలో లేని అంశాలను బోధించడంతో వర్సిటీలో ప్రతిరోజూ నిరసనలు తెలియజేస్తున్నారు. గత సంవత్సరం దిల్లీ వర్సిటీలో చరిత్ర పాఠాలనుంచి 'బ్రాహ్మణైజేషన్' పదాన్ని ఉపసంహరించుకున్నారు. అలాగే అసమానతల అంశాన్ని కూడా తొలగించారు. ఈ బలవంతపు బోధనలపై లెక్చరర్లు, ప్రొఫెసర్లు తీవ్రంగా బాధపడుతున్నారు. ఆర్ఎస్ఎస్ అనుకూల బోధకులపైన మేధావివర్గాలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ బోధకులు మాత్రం చరిత్రలోలేని అంశాలను బోధించాలని పట్టుపడుతున్నారు. సమతుల్యమైన

చారిత్రక అంశాలను పాఠాలలోచేర్చి వాటిని అభివృద్ధి పరచాలని కొత్తగా చేర్చిన పాఠాలను తొలగించాలని మేధావివర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. 2023లో పన్నెండవ తరగతి రాజకీయశాస్త్ర పాఠ్యపుస్తకాల నుంచి మహాత్మాగాంధీని చంపివేసిన అంశాలలో కొన్నింటిని తీసివేయాలని ఎన్‌సిఇఆర్‌టి నిర్ణయించింది. ఈ అంశాలు పాఠ్యపుస్తకాల నుంచి బోధించడం ఆర్ఎస్ఎస్‌కు

> ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని 'బంచ్ ఆఫ్ థాట్స్' రచనలో ఎంఎస్ గోల్వాల్కర్ నింపారు. దక్షిణాసియాలో ప్రాచీన భౌగోళిక రాజకీయాల చరిత్రను కూడా బంచ్ ఆఫ్ థాట్స్‌లో వక్రీకరించారు. ఈ భావజాలాన్ని ఆర్ఎస్ఎస్ నడిపే 'ఆర్గనైజర్', 'పాంచజన్య' పత్రికలలో పొగుడుతూ ప్రచారం సాగిస్తున్నారు. సంఘ్‌పరివార్ వక్రీకరణను నిరంతరం ప్రచారంలో పెట్టారు. కొత్తగా నిర్మించిన పార్లమెంటులో వక్రీకరణలతోకూడిన కుడ్య చిత్రణను చిత్రించారు.

నచ్చడంలేదు. మహాత్మాగాంధీని నాథూరం వినాయక్ గాడ్సే కాల్చిచంపిన విషయాన్ని దీని వెనుకున్న దురుద్దేశాలను పుస్తకాలనుంచి తొలగించాలన్నది ఆర్ఎస్ఎస్ కోరిక. గాంధీని చంపడం అత్యంత ఘోరమైన తప్పిదం. ఈ అంశాలన్నింటిని పాఠ్యపుస్తకాల నుంచి తొలగించాలని ఎన్‌సిఇఆర్‌టీని కోరారు. కొన్ని దశాబ్దాలుగా ఆర్ఎస్ఎస్ అనుకూల రచయితలు రహస్యంగా లెక్కలేనన్ని అబద్ధాలను చేర్పించారు. గాడ్సే బ్రాహ్మణుడు అని గుర్తింపునిచ్చిన అంశాన్ని పాఠ్యపుస్తకాల నుంచి తొలగించాలని ఎన్‌సిఇఆర్‌టీ నిర్ణయించింది. తాను బ్రాహ్మణుడన్న గుర్తింపు ఉండరాదని గాడ్సే కోరిక. అందువల్లనే పాఠ్యపుస్తకం నుంచి తొలగించాలని ఆర్ఎస్ఎస్ ఒత్తిడిచేసింది. మహాత్మాగాంధీని ఎందుకు హత్య చేయవలసి వచ్చిందనే వివరణను పుస్తకం నుంచి తొలగించారు. పుస్తకం నుంచి తొలగించిన అంశం ఇలా ఉంది. "ఆయన (గాంధీ) ప్రత్యేకించి హిందువులు ప్రతీకారం తీసుకునేందుకు ఇష్టపడలేదు. ఇండియా కేవలం హిందువులకు మాత్రమే ఉండాలన్న విషయాన్ని కూడా గాంధీ వ్యతిరేకించారు. అదేవిధంగా ముస్లింలు కూడా పాకిస్థాన్ కావాలని కోరడాన్ని తిరస్కరించారు. పాకిస్థాన్ ఏర్పాటు ముస్లింలు కోరుకోవడాన్ని గాంధీ ఇష్టంగా ఉన్నారని హిందువులు ఆరోపించారు. అయితే గాంధీ మాత్రం హిందువులు తప్పుదారి పడుతున్నారని భావించారు. హిందువులకు మాత్రమే ఇండియా పరిమితం కావాలని ప్రయత్నిస్తే అది విధ్వంసానికి దారితీస్తుందని గాంధీ అభిప్రాయపడ్డారు. అలాగే హిందు- ముస్లింల ఐక్యతను హిందూ తీవ్ర వాదులు వ్యతిరే కించారు. అంతేకాదు, గాంధీజీని హత్య చేసేందుకు అనేకసార్లు ప్రయత్నాలు చేశారు."

స్వతంత్ర భారతదేశం ఏర్పడిన సమయంలో ఆర్ఎస్ఎస్ ఆధునిక భారతదేశ చరిత్ర హిందువుల చరిత్రగానే ఉండాలని, లేదా హిందురాష్ట్రంగా ఉండాలని ఆర్ఎస్ఎస్ కోరుకున్నది. మహాత్మాగాంధీ మాత్రం ఇండియా సెక్యులర్ ప్రజాస్వామ్య దేశంగా ఉండాలని అభిలషించారు. హిందూరాష్ట్ర ప్రాజెక్టు ముసాయిదాను అప్పటి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ ఎమ్ఎస్. గోల్వల్కర్ తన పుస్తకం "ఉయ్ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్" లో పేర్కొన్నారు. ఆయన పుస్తకంలో హిందువులు కానివారంతా విదేశీయులని ప్రకటించారు. గాంధీ ఇతర జాతీయవాదులు దేశాన్ని హిందూ రాష్ట్రంగా తయారుచేసేందుకు ప్రయత్నించినట్లయితే ఇండియా భావన విధ్వంసమవుతుందని చెప్పారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన వ్యక్తిగా అత్యున్నత నైతికత కలిగిన వారుగా హిందుత్వ శక్తులను వ్యతిరేకించారు. హిందురాష్ట్ర భావనను తిరస్కరించారు. హిందుత్వ శక్తులు గాంధీ అభిప్రాయాలను గట్టిగా వ్యతిరేకించారు. హిందురాష్ట్ర ప్రాజెక్టును నిర్మించాలనుకున్న ఆర్ఎస్ఎస్‌కు గాంధీ పెద్ద ఆటంకంగా తయారయ్యారని నిర్ణయించుకున్నారు. ఈ అభిప్రాయాలతో కరుడుగట్టిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త, హిందూ రాష్ట్ర ఉన్మాది నాథూరామ్ గాడ్సే గాంధీని చంపాలని గట్టిగా నిర్ణయించుకున్నాడని అయితే ఈ అంశాన్ని ఆర్ఎస్ఎస్ అభిమానులు బైటకు వెల్లడికాకుండా రహస్యంగా ఉంచారు.

జార్ఖండ్‌లో వామపక్షాల రాజకీయ ప్రాధాన్యత

రవీంద్రనాథ్ సిన్హా

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయమైన సంఖ్యలో పోటీచేసేందుకు వామపక్షపార్టీలు నామినేషన్లు దాఖలు చేశాయి. అన్నిటికంటే ముఖ్యంగా సెప్టెంబరు 9వ తేదీన తీవ్ర వామపక్ష రాజకీయాలను అనుసరిస్తున్న రెండు పార్టీలు విలీనవం కావడం రాష్ట్రంలో వామపక్షాలకు అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాటికి రాజకీయ ప్రాధాన్యత కూడా పెరిగింది. ధన్‌బాగ్ బొగ్గుగనుల ప్రాంతంలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో గణనీయమైన సంఖ్యలో ఈ పార్టీల కార్యకర్తలు ఉన్నారు. ఇక్కడ ఏకే రాయ్(అరుణ్‌కుమార్ రాయ్) ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో అనేక సంవత్సరాలుగా అత్యంత కీలకపాత్ర వహించి కార్మికుల కోసం పోరాటం చేస్తున్నారు. మార్క్సిస్టు కో ఆర్డినేషన్ కమిటీ ప్రముఖ నాయకులు ఏకే రాయ్. అయితే ఈ విషయం అన్ని ప్రాంతాలలో అంత ఎక్కువగా తెలియదు. సెప్టెంబరు 9 న మార్క్సిస్టు కో ఆర్డినేషన్ కమిటీ(ఎమ్‌సీసీ) సీపీఐ మార్క్సిస్టు-లెనినిస్టు(లిబరేషన్) పార్టీతో విలీనమైంది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు ఎమ్‌సీసీ నాయకులు అరూప్‌ఛటర్జీ, చంద్రదేవ్ మహతో అలియాస్ బబ్లూ మహతో సీపీఐ-ఎంఎల్ అభ్యర్థులుగా నిర్సా, సింద్రీ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలనుకుంటున్నారు. సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి మనోజ్ భట్, నిర్సా అభ్యర్థి ఛటర్జీ ఐపీఏతో మాట్లాడుతూ లోతుగా చాలాకాలంగా చర్చించిన

తర్వాత ఎమ్‌సిసీ, సీపీఐ ఎంఎల్ పార్టీలు విలీనమయ్యాయని చెప్పారు. 2019 ఎన్నికల్లో చటర్జీ పోటీచేసి ఓడిపోయారు. అయితే అంతకు ముందు 2014 లో నిర్సా నుంచి విజయం పొందారు. మెయిథాన్, పంఛట్ ఆనకట్టల ప్రాంతంలో ఛటర్జీకి మంచి పలుకుబడి ఉంది.

సీపీఎం-సీపీఐ(ఎంఎల్)గ్రూపునకు చెందిన ఇద్దరు నాయకులను పోటీ పెట్టేందుకు ఎంపిక చేశారు. బాగోదర్‌లో (గిరీడ్ జిల్లా) ఎంఎల్‌ఏ వినోద్‌సింగ్, రాజ్‌కుమార్ యాదవ్(గిరీడ్‌జిల్లా)లు పోటీచేయాలని భావించారు. అయితే సంకీర్ణ కూటమితో కొన్ని విభేదాలు ఏర్పడ్డాయి. ప్రత్యేకించి చెప్పాలంటే జార్ఖండ్ ముక్తి మోర్చా నాయకులతోనే విభేదాలు వచ్చాయి. ధన్వర్ ప్రాంతంలో తమకు మంచి పలుకుబడి ఉన్నందున అక్కడి నుంచి పోటీ చేస్తామని జెఎంఎంను భక్త్ విజ్ఞప్తి చేశారు. భక్త్, ఛటర్జీలు రెండుపార్టీలు విలీనం కావడం వలన ధన్‌బాగ్ బొగ్గు గనుల ప్రాంతంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం రానున్న రోజుల్లో మరింతగా బలపడుతుందని తద్వారా రాజకీయాలపైన కూడా తమ ప్రభావం పెరుగుతుందని చెప్పారు. రెండు పార్టీల విలీనం కారణంగా రాజకీయ ప్రాధాన్యత కూడా పెరిగిందని అయతే సంఖ్యాబలాన్ని చూసి నిర్ణయించలేమని అన్నారు. సీపీఐ, సీపీఎం అభ్యర్థులు కూడా ఎన్నికల పోటీ రంగంలో ఉన్నారు. కొన్ని నియోజకవర్గాలలో వీరు పోటీకి నామినేషన్లు దాఖలు చేశారు. సీపీఐ రాష్ట్ర నాయకత్వం 9 నియోజకవర్గాలలో పోటీచేయాలని నిర్ణయించి కేంద్ర నాయకత్వం నుంచి అనుమతి కోరారు. అలాగే మరికొంతమంది నాయకులను కూడా పోటీ చేయడానికి అనుమతించాలని కోరినట్టు సీపీఐ రాష్ట్రకార్యదర్శి మహేంద్ర పాఠక్ తెలిపారు. 15 నియోజకవర్గాలలో పోటీచేయాలని రాష్ట్ర నాయకత్వం అభిలషిస్తుందని, కేంద్ర నాయకత్వం అయితే 10 సీట్లకు పరిమితం అయితే బాగుంటుందని సూచించినట్లుగా పాఠక్ తెలియజేశారు.

గిరిజన ప్రాంతాల్లో సీపీఐ కార్యకర్తలు సంవత్సరం అంతా క్రియాశీలకంగా పనిచేస్తున్నారని పాఠక్ అన్నారు. సీపీఎం తమ పార్టీ బలానికి అనుగుణంగా 9 సీట్లలో పోటీ చేస్తామని, అంగీకృతమైన నాయకులను ఎంపిక చేసి పోటీలో నిలుపుతామని అన్నారు. అయితే గిరిజన నాయకుల్లో ఒకరు ఎస్‌పీ, ఒకరు మైనారిటీ, ఇద్దరు జనరల్ కేటగిరీనాయకులు ఉన్నట్లుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ప్రకాఫ్ విప్లాబ్ తెలియజేశారు. వివిధ నియోజకవర్గాల్లో ఇప్పటికే పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు. నామినేషన్లు ఉపసంహరించుకునే నాటికి వామపక్షాల అభ్యర్థులు ఎంతమంది పోటీలో ఉంటారనే అంశం స్పష్టమవుతుంది.

22 లేదా 24 మంది పోటీచేసే అవకాశం ఉందని వామపక్ష వర్గాలు తెలియజేశాయి. వివిధ పార్టీల నాయకులను సంప్రదించగా జెఎమ్ఎమ్, కాంగ్రెస్‌లు వామపక్షాలను ఇండియా బ్లాక్‌లోకి తీసుకుని కొన్ని సీట్లు కేటాయించాలనే అభిప్రాయంతోనే ఉన్నాయి. అన్ని పార్టీలు కలిపి పోటీ చేయడం వల్ల బీజేపీ ఓటమికి బలమైన అవకాశాలు ఉన్నాయి. అయితే హర్యానా, జమ్ముకశ్మీర్ రాష్ట్రాలలో బీజేపీ బలాన్ని పెంచుకోవడంతో జార్ఖండ్ లోనూ గెలిచేందుకు అనేక ఎత్తుగడలు వేస్తున్నది.

గిరిజన ప్రాంతాల్లోనూ గట్టిగా పోరాడుతున్నది. ఐదునెలలక్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎక్కువమంది గిరిజనులు ఉన్న ప్రాంతాల్లో పెద్దగా ఫలితం పొందలేదు. జార్ఖండ్‌లో 43 సీట్లలో పోటీచేసి బీజేపీ ఏ ఫలితం పొందలేదు. ఈ సారికూడా జెఎంఎం 50 లేదా ఆపైన సీట్లలో పోటీచేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. వీటిలో కనీసం 41 సీట్లు గెలుపొందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బర్హైయిత్ నుంచి హేమంత్ సోరెన్ పోటీ చేయనున్నారు. సీపీఐ-ఎంఎల్‌కు ధన్వర్ స్థానం కేటాయించే అవకాశం ఉంది. 2019లో కాంగ్రెస్ 31సీట్లలో పోటీ చేయగా ఈ సారి 30సీట్లకు పరిమితమవుతారని భావిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన తర్వాత వామపక్షాలను కలుపుకుని ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం ఉందని ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు కిశోర్ సహదేవ్ తెలియజేశారు. అలాగే లాలూప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని ఆర్‌జేడీకి కూడా ఆరుసీట్లు కేటాయించే అవకాశం ఉంది. 2019 లో ఆల్ జార్ఖండ్ స్టూడెంట్ యూనియన్ బీజేపీకి సహకరించలేదు. ఈ సారి 10సీట్లు తమకు కేటాయిస్తే బీజేపీకి తోడ్పాటు ఇచ్చే అవకాశం కనిపిస్తుంది.

ఏకపక్ష నిర్ణయం సరికాదు

కాంగ్రెస్‌కు రౌత్ హెచ్చరిక

ముంబై: సోలాపూర్ సౌత్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తన అభ్యర్థిని ప్రకటించడంపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ మండిపడారు. 'మేము ఇప్పటికే అభ్యర్థిని(అమర్ పాటిల్) ప్రకటించిన సోలాపూర్ సౌత్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి (దిలీప్ మానే) బరిలోకి దిగుతున్నట్లుగా ఆ పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాలో ఈ విధంగా ఉండటం బహుశా టైపింగ్ పొరబాటని అనుకుంటున్నాను. మా వైపు నుంచి కూడా అలా జరిగే అవకాశం ఉండొచ్చు. కానిపక్షంలో ఆ తప్పు మేమూ చేయాల్సి వస్తుంది. ఇటువంటి చర్యల వల్ల మహా వికాస్ అఘాడిలో సమస్యలు వచ్చే ప్రమాదముంది' అని ఆయన హెచ్చరించారు. సీట్ల పంపిణీలో భాగంగా శివసేన (యూబీటీ) పోటీ చేయాలని నిర్ణయించుకున్న మిరాజ్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి స్థానిక కాంగ్రెస్ నాయకులు పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని సమాచారం వచ్చిందని, మిత్రపక్షాలకు వ్యతిరేకంగా చేస్తున్న ఈ ఆలోచనలు సరైనవి కాదని అన్నారు. కాగా సోలాపూర్ సౌత్ స్థానంలో పోటీ చేయాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్లుగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర స్థాయిలో వ్యాఖ్యానించలేమని, సంజయ్ రౌత్ కూటమి నేతలతో చర్చించాలని సూచిస్తున్న ట్లుగా పేర్కొన్నారు. కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ) ప్రతిపక్ష మహా వికాస్ అఘాడిలో కూటమి సభ్యులుగా పోటీ చేస్తున్నాయి. రేపటితో నామినేషన్ల దాఖలు అంశం ముగుస్తుంది.

నాన్న హత్యతో సల్మాన్‌కు నిద్ర లేదు

సిద్ధిఖీ తనయుడు జిషాన్

ముంబై: ఎన్సీపీ (అజిత్ పవార్) వర్గం నేత, తన తండ్రి బాబా సిద్ధిఖీ దారుణహత్యతో బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ తీవ్ర కుంగుబాటుకు గురయ్యారని సిద్ధిఖీ తనయుడు జిషాన్ తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో సల్మాన్ తమ కుటుంబానికి ఎంతో అండగా నిలిచారన్నారు. ప్రతిరోజూ ఫోన్ చేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు. 'నా తండ్రితో సల్మాన్‌ఖాన్‌కు మంచి అనుబంధం ఉంది. ఆయన మరణంతో సల్మాన్ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మా కుటుంబానికి మద్దతుగా నిలిచారు. మాకెంతో ధైర్యాన్ని ఇచ్చారు. నాన్న మరణం తర్వాత బాధతో ఆయనకు నిద్రపట్టడం లేదు. ప్రతిరోజూ రాత్రి నాకు ఫోన్ చేస్తుంటారు. నా తండ్రితో తనకున్న అనుబంధం గురించి చెబుతుంటారు' అని జిషాన్ తెలిపారు. సినీ కుటుంబానికి చెందిన వారందరితో తన తండ్రికి స్నేహం ఉందని చెప్పారు. వాళ్లందరూ తనకు కుటుంబంతో సమానమన్నారు.

పప్పు యాదవ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపు

పాట్నా: పూర్ణియా లోక్‌సభ ఎంపీ పప్పు యాదవ్‌కు నిషేధిత లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి చంపుతామంటూ బెదిరింపు కాల్ వచ్చింది. దీనిపై ఆయన డీజీపీకి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టం అనుమతిస్తే 24 గంటల్లో లారెన్స్ బిష్ణోయ్ గ్రూప్‌ను లేకుండా చేస్తానని పప్పు యాదవ్ ఇటీవల సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ముంబైలో ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్యానంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. దీంతో బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ఆయనకు తాజాగా బెదిరింపులు వచ్చాయి. యాదవ్ కదలికలను జాగ్రత్తగా గమనిస్తున్నామని, సల్మాన్ ఖాన్‌కు సంబంధించిన వ్యవహారాలకు దూరంగా ఉండకపోతే ఆయనను కూడా చంపేస్తామని కాలర్ హెచ్చరించాడు. 'ఒక క్రిమినల్ జైలులో కూర్చుని సవాళ్లు విసురుతున్నాడు. జనాలను చంపుతుంటే ప్రతి ఒక్కరూ మౌన ప్రేక్షకుల్లా చూస్తున్నారు. మొదట మూసేవాలా, ఆ తర్వాత కర్ణిసేన అధ్యక్షుడు, ఇప్పుడు రాజకీయ వేత్తగా మారిన పారిశ్రామికవేత్త. చట్టం కనుక అనుమతిస్తే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను నేను తుదముట్టిస్తాను' అని పప్పు యాదవ్ ఇంతకుముందు ట్వీట్ చేశారు. కాగా, లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి చంపుతామంటూ బెదిరింపులు రావడంతో తనకు భద్రత పెంచాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పప్పు యాదవ్ లేఖ రాశారు. తనకు 'జడ్' కేటగిరి భద్రత కల్పించాలని కోరారు. బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపుల కారణంగానే ఈ భద్రతను కోరుతున్నట్టు ఆయన తన లేఖలో పేర్కొన్నారు. లేఖ ప్రతిని బీహార్ ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, పోలీసు అధికారులకు పంపారు.

రాజ్యాంగ విలువలకు చేటు

మోదీ సర్కారుపై ప్రియాంక గాంధీ విమర్శ

వయనాడ్: వయనాడ్ ఉప ఎన్నికలకు తన రెండవ దశ ప్రచారాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడికి దిగారు. బీజేపీ పాలనలో రాజ్యాంగ విలువలు నిరంతరం ధ్వంసమవుతున్నాయని ఆరోపించారు. ఈ పర్వత ప్రాంత జిల్లాలోని మీనంగడిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కూడా అయిన ప్రియాంక మణిపూర్‌లో హింసను ప్రస్తావిస్తూ దేశంలో మైనారిటీలపై 'ప్రణాళిక' ప్రకారం దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాజంలో భయం, కోపం, బాధను వ్యాప్తి చేస్తోందని మీకు తెలుసు. మీరు మైనారిటీలపై ప్రణాళికాబద్ధంగా దాడిని చూశారు. మీరు మణిపూర్‌లో దాడులను చూశారు. మీరు తరచూ ఆగ్రహం, ద్వేషం, భయాన్ని ఏకీకృతం చేయడం చూశారు' అని ఆమె అన్నారు. సాధారణ ప్రజల కంటే ప్రధాని నరేంద్ర మోదీ స్నేహితులకు అనుకూలంగా ఉండేలా విధానాలు రూపొందిస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి ఆరోపించారు. పగలు రాత్రి కష్టపడుతున్న రైతుల పట్ల కనికరం లేదని, గిరిజనులపై అవగాహన లేదని, వారి భూములు ధనవంతుల కోసం లాక్కుంటున్నారని ఆమె మండిపడ్డారు. ఈ లోక్‌సభ స్థానాన్ని ఖాళీ చేసిన తన సోదరుడు రాహుల్ గాంధీని ప్రస్తావిస్తూ వయనాడ్‌ను విడిచిపెట్టినందుకు అతని హృదయం ఎంత భారంగా ఉందో తనకు తెలుసని ప్రియాంక అన్నారు. 'నా అన్న మీద ఉన్న ప్రేమ వల్లే మీరు ఇక్కడికి వచ్చారని నాకు తెలుసు. అతనికి మీ అందరితో గాఢమైన సంబంధం ఉంది, మీరే అతని కుటుంబం. ఈ రోజు మనం చాలా పెద్ద యుద్ధం చేస్తున్నాం. ఆ పోరాటానికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు. ఈ రోజు మనమందరం రాజ్యాంగ విలువల కోసం, ప్రజాస్వామ్యం కోసం, సమానత్వం కోసం పోరాడుతున్నాం. మీలో ప్రతి ఒక్కరూ ఈ పోరాటంలో ముఖ్యమైన సైనికులు' అని అన్నారు. తాను పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయితే వీలైనంత కష్టపడి పనిచేస్తానని ప్రియాంక అన్నారు. సమావేశం తర్వాత 150 మీటర్ల సుదీర్ఘ రోడ్ షో జరిగింది. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు మనంతవాడి అసెంబ్లీ నియోజకవర్గంలోని పనమరంలో జరిగిన తదుపరి సమావేశానికి ప్రియాంక వెళ్లారు.

మదర్ థెరీసా స్ఫూర్తితో ముందుకు...

కేరళలోని వయనాడ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ మానవతా మూర్తి మదర్ థెరీసాతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'మా నాన్న రాజీవ్ గాంధీ హత్య జరిగిన కొద్ది రోజులకు మదర్ థెరెసా మమ్మల్ని పలకరించడానికి ఇంటికి వచ్చారు. అప్పుడు నాకు 19ఏళ్లు. ఆమె వచ్చిన సమయంలో జ్వరంతో బాధపడుతున్నాను. అమ్మను పలకరించిన అనంతరం థెరీసా నా దగ్గరికి వచ్చి తలపై చేయి పెట్టి ఆశీర్వదించారు. నిరుపేదల కోసం పని చేయాలని నన్ను ఆహ్వానించారు. దాదాపు 6 సంవత్సరాల తర్వాత నేను వారి సంస్థతో కలిసి పని చేయడానికి వెళ్లాను. అక్కడ ఉన్న సోదరీమణులతో కలిసి బాత్రూంలు శుభ్రం చేయడం, వంట చేయడం వంటి పనులు చేశాను. అప్పుడే కష్టాల్లో ఉన్న వారికి సమాజం ఎలా చేయూతనందిస్తుందో తెలుసుకున్నాను. వారు పడే బాధలు కళ్లారా చూశాను. అదేవిధంగా వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో మీరు ఒకరికొకరు ఏ విధంగా సహాయపడ్డారో చూశాను. కష్టాల్లో ఉన్న తోటి వారికి సహాయం చేయాలనే మదర్ థెరీసా మాటలను మీరు రుజువు చేశారు' అని ఆమె పేర్కొన్నారు. వయనాడ్ ప్రజల ప్రేమకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటానని ప్రియాంక గాంధీ అన్నారు. తాను నామినేషన్ వేయడానికి వచ్చినప్పుడు ఓ ఆర్మీ అధికారి తల్లి తనపై చూపిన అభిమానాన్ని ఎప్పటికీ మరచిపోలేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే పేదల సమస్యల గురించి ఆలోచిస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వ్యాపారవేత్తలైన తన స్నేహితులకు అనుకూలంగా పాలసీలు రూపొందిస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేసిన రాహుల్‌గాంధీ రాజీనామా చేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో ప్రియాంకాగాంధీ కాంగ్రెస్ తరఫున పోటీకి దిగారు. కేరళలో పాలక్కాడ్, చెలక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నిక నవంబర్ 13న జరగనుంది. నవంబర్ 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

కుల గణనపై అఖిలపక్షం

కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: జనాభా గణనలో అన్ని కులాల సవివరమైన గణన ఉంటుందా, లోక్‌సభలో ప్రతి రాష్ట్రం బలాన్ని నిర్ణయించడానికి జనాభా గణనను ఉపయోగించాలా అనే దానిపై స్పష్టత రావడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సోమవారం డిమాండ్ చేసింది. రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ పదవీకాలం పొడిగింపు నోటిఫై చేశారని, దీని అర్థం 2021లో జరగాల్సిన జనాభా గణన ఎట్టకేలకు త్వరలో నిర్వహించబడుతుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాలు) జైరాం రమేశ్ అన్నారు. 'అయితే రెండు కీలకమైన అంశాలపై ఇంకా స్పష్టత లేదు. ఈ కొత్త జనగణనలో 1951 నుంచి ప్రతి గణనలో జరుగుతున్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలతో పాటు దేశంలోని అన్ని కులాల వివరణాత్మక గణన కూడా ఉంటుందా? భారత రాజ్యాంగం ప్రకారం కుల గణన కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత' అని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ జనాభా గణనను భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 82లో అందించిన విధంగా లోక్‌సభలో ప్రతి రాష్ట్రం బలాన్ని నిర్ణయించడానికి ఉపయోగించబడుతుందా, కుటుంబ నియంత్రణలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రాలకు నష్టం కలిగించే విధంగా ఏదైనా పునర్వ్యవస్థీకరణ ఉందా?' అని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు. ఈ రెండు కీలక అంశాలపై స్పష్టత వచ్చేలా త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే సముచితమని జైరాం రమేశ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రిజిస్ట్రార్ జనరల్, భారత జన గణన కమిషనర్‌గా పని చేస్తున్న మృత్యుంజయ్ కుమార్ నారాయణ్‌కు సెంట్రల్ డిప్యుటేషన్‌ను ఆగస్టు 2026 వరకు పొడిగించారు. జనాభా గణన ఇంటి జాబితా దశ, జాతీయ జనాభా రిజిస్టర్‌ని నవీకరించే కసరత్తు ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30, 2020 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కోవిడ్-19 వ్యాప్తి కారణంగా జనాభా గణన ప్రక్రియ నిలిచిపోయింది.

తాజ్ హోటల్‌కు బాంబు బెదిరింపు

లక్నో: దేశంలో విమానాలు, పాఠశాలలు, హోటళ్లు ... ఇలా ప్రతినిత్యం బాంబు బెదిరింపులతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. తిరుపతి, రాజ్‌కోట్, కోల్‌కతా, లక్నోలోని ప్రముఖ హోటళ్లకు ఆదివారం ఈ-మెయిళ్ల ద్వారా బాంబు బెదిరింపులు రాగా, సోమవారం లక్నోలోని ఓ ఫైవ్ స్టార్ హోటల్‌కు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. హజ్రత్‌గంజ్ ప్రాంతంలో ఉన్న తాజ్ హెటల్‌కు ఉదయం ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు హోటల్ ఆవరణలో బాంబు పెట్టినట్లు అందులో పేర్కొన్నారు. అప్రమత్తమైన హోటల్ యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన పోలీసు అధికారులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో హోటల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే, ఎలాంటి అనుమానాస్పద వస్తువు, పేలుడు పదార్థాలూ లభించలేదని తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కోల్‌కతాలో 10 ప్రముఖ హోటళ్లకు, రాజ్‌కోట్‌లో 10 హెూటళ్లు, లక్నోలో 10 ప్రధాన హోటళ్లకు ఆదివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఉన్న మూడు హోటళ్లకు శుక్ర, శనివారాల్లో నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. హోటళ్లకే కాదు దాదాపు 50 విమానాలకు ఆదివారం బాంబు బెదిరింపులు రాగా, 14 రోజుల్లో 350కిపైగా విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి.

షిండే, అజిత్ పవార్ నామినేషన్లు



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ఊపందుకుంది. ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తదితర ప్రముఖులు సోమవారం నామినేషన్లు వేశారు. కొప్రి పచ్‌పాఖడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే, బారామతి నియోజకవర్గం నుంచి అజిత్ పవార్ నామినేషన్ దాఖలు చేశారు. అజిత్ మేనల్లుడు, శరద్ పవార్ మనుమడు యుగేంద్ర పవార్ బారామతి నియోజకవర్గం నుంచి ఎన్సీపీ-ఎస్పీ అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌ను ఓడించగా, మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో పవార్ వర్సెస్ పవార్ (అజిత్ పవార్-యుగేంద్ర పవార్) మధ్య బారామతిలో ఆసక్తికరమైన పోటీ నెలకొంది. అజిత్ పవార్ నామినేషన్ వేయడానికి ముందు రోడ్‌షోలో పాల్గొన్నారు. యుగేంద్ర యాదవ్ పోటీపై మాట్లాడుతూ పోటీలో ఎవరున్నా ఈసారి కూడా బారామతి ప్రజలు తననే ఎన్నుకుంటారనే నమ్మకం తనకుందన్నారు. పోటీ దురదృష్టకరమే అయినా కుటుంబంలోని తామంతా పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్‌తోనే ఉండాలని నిర్ణయించినట్టు యుగేంద్ర పవార్ చెప్పారు. శరద్ పవార్ వల్లే బారామతి సహా చుట్టపక్కల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సొంత మేనమామపైనే పోటీకి దిగడం కష్టమని అనుకోవడం లేదని, అలాగని తేలిగ్గానూ తీసుకోవడం లేదని చెప్పారు. బారామతి ప్రజలు పవార్ సాహెబ్ వెంటే ఉన్నారని, అది లోక్‌సభ ఎన్నికల్లో రుజువైందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అదే ఆదరణ చూపుతారనే నమ్మకం ఉందని తెలిపారు.

ముడా మనీలాండరింగ్ కేసు...

కర్నాటకలో ఈడీ సోదాలు

బెంగళూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన కుటుంబం, ఇతరులపై కేసు నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం తాజాగా సోదాలు చేపట్టిందని అధికారిక వర్గాలు తెలిపాయి. బెంగళూరు, మైసూరులోని ఏడెనిమిది ప్రాంగణాల్లో సోదాలు జరుగుతున్నాయని, ఇందులో బెంగళూరులోని ఒక బిల్డర్, సంబంధం ఉన్న మరికొంతమంది వ్యక్తుల ప్రాంగణాలు ఉన్నాయని వివరించాయి. దర్యాప్తు సంస్థ ఈ కేసులో అక్టోబరు 18న మైసూరులోని ముడా కార్యాలయంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో సోదాలు చేసింది. గతవారం బెంగళూరు జోనల్ కార్యాలయంలో ముడాకు చెందిన కొంతమంది కిందిస్థాయి అధికారులను ప్రశ్నించింది. లోకాయుక్త ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకుని కర్నాటక ముఖ్యమంత్రి, ఇతరులపై కేసు నమోదు చేయడానికి ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు సమాచార నివేదిక (ఈసీఐఆర్) దాఖలు చేసింది. ముడా తన భార్యకు 14 స్థలాల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సిద్ధరామయ్య లోకాయుక్త, ఈడీ విచారణ ఎదుర్కొంటున్నారు. సిద్ధరామయ్య భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, దేవరాజు, ఇతరులను రెండు దర్యాప్తు సంస్థలు ఈ కేసులో ఇతర నిందితులుగా పేర్కొన్నాయి. పార్వతిని లోకాయుక్త పోలీసులు ఇటీవల మైసూరులో ప్రశ్నించారు. పార్వతికి మైసూరులోని ఒక మార్కెట్ ప్రాంతంలో 14 పరిహార స్థలాలు కేటాయించారని ఆరోపించారు. ముడా ద్వారా సేకరించిన ఆమె భూమి స్థలంతో పోలిస్తే ఇది ఎక్కువ ఆస్తి విలువ కలిగి ఉంది. ముడా పార్వతికి 3.16 ఎకరాల భూమికి బదులుగా 50:50 నిష్పత్తి పథకం కింద ప్లాట్లను కేటాయించింది. అక్కడ అది నివాస లేఅవుట్‌ను అభివృద్ధి చేసింది. మైసూరు తాలూకాలోని కసబా హుబ్లీలోని కసరే గ్రామంలోని సర్వే నంబర్ 464లో ఉన్న ఈ 3.16 ఎకరాల భూమిపై పార్వతికి చట్టబద్ధమైన హక్కు లేదని ఆరోపించారు. అయితే ఈ వివాదం చెలరేగడంతో పార్వతి తనకు కేటాయించిన ప్లాట్లను ముడాకు తిరిగి ఇస్తున్నట్లు ప్రకటించారు. తాను లేదా అతని కుటుంబం ఎలాంటి తప్పు చేయలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఖండించారు. ప్రతిపక్షాలు తనను చూసి భయపడుతున్నాయని, తనపై మొదటి 'రాజకీయ కేసు' అని పేర్కొన్నారు.

ఆర్మీ వాహనంపై ఉగ్రదాడి

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో వరుస ఉగ్రదాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రతినిత్యం ఎక్కడో ఒకచోట భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడుతున్నారు. తాజాగా అఖ్నూర్ సెక్టార్‌లో ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం కలకలం సృష్టించింది. ఆర్మీ అధికారుల సమాచారం ప్రకారం... అఖ్నూర్ సెక్టార్ ప్రాంతంలో సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో ఆర్మీ వాహనంపై చాలాసేపు కాల్పులు జరిపిన ఉగ్రవాదులు అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. అప్రమత్తమైన అధికారులు... ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఓ ఉగ్రవాదిని ఆర్మీ మట్టుబెట్టినట్లు తెలిసింది. దీపావళిని పురస్కరించుకుని జమ్మూ ప్రాంతంలో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు నిర్వహిస్తున్న తరుణంలో కాల్పుల ఘటన చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. జమ్మూకశ్మీర్ అంతటా... ముఖ్యంగా లోయలో గత వారంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు సైనికులు సహా కనీసం 12 మంది మరణించారు. ఈ నెల 24న, బారాముల్లాలోని గుల్‌మార్గ్ సమీపంలో ఉగ్రవాదులు ఆర్మీ వాహనంపై మెరుపుదాడి చేయగా ఇద్దరు సైనికులు, ఆర్మీలో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు మరణించారు. గాందర్‌బల్ జిల్లాలో సోన్‌మార్గ్ ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో ఓ వైద్యుడు, ఐదుగురు వలస కార్మికులు మృతి చెందారు.

ఆధార్‌పై పోరాడిన జస్టిస్ పుట్టస్వామి కన్నుమూత

బెంగుళూరు: ఆధార్ పథకానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం చేసిన కర్నాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి కేఎస్ పుట్టస్వామి (98) సోమవారం కన్నుమూశారు. 2012లో ఆధార్ నమోదుకు వ్యతిరేకంగా ఆయన సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేశారు. ఎటువంటి శాసనపరమైన మద్దతు లేకుండానే ఆధార్ స్కీమ్‌ను ప్రవేశపెట్టినట్లు ఆరోపించారు. పుట్టస్వామి... ఫిబ్రవరి 8, 1926లో జన్మించారు. మైసూరులోని మహారాజ కాలేజీ, బెంగుళూరులోని లా కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. 1952లో ఆయన అడ్వకేట్‌గా నమోదు చేసుకున్నారు. హైకోర్టుకు ప్రభుత్వ అదనపు అడ్వకేట్ గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆధార్‌ను తప్పనిసరి చేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. ఆ అంశంలో ప్రైవసీ హక్కు కోసం ఆయన పోరాటం చేశారు. ప్రైవసీ అనేది ప్రాథమిక హక్కు అన్నారు.

రైలు ఎక్కేందుకు ప్రయాణికుల ఆత్రుత

ముంబై: బాంద్రా టెర్మినస్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగిన తొక్కిసలాటలో పది మందికి పైగా గాయపడటం తీవ్ర సంచలనం సృష్టించింది. రైల్వే శాఖ మౌలిక వసతుల కల్పన, భద్రతా ఏర్పాట్లపై ఆందోళనలు, విమర్శలు వెల్లువెత్తాయి. తొక్కిసలాటకు ముందు ఫ్లాట్ ఫాంపై ఏమి జరిగిందో తెలిపే సీసీటీవీ ఫుటేజ్ తాజాగా వెలుగుచూసింది. అన్‌రిజర్వ్‌డ్ ట్రైను ఫ్లాట్‌ఫాం నుంచి కదలడానికి కొద్ది సేపటి ముందు ప్రయాణికులు ఒక్కసారిగా రైలు ఎక్కేందుకు పోటీపడటం, ఒకరినొకరు నెట్టుకో వడంతో తీవ్ర గందరగోళ పరిస్థితి తలెత్తింది. రైల్వే యార్డ్ నుంచి తెల్లవారుజామున 2.44 గంటలకు 22 బోగీల అన్‌రిజర్వ్‌డ్ బాంద్రా-గోరఖ్‌పూర్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రాగానే ఒక్కసారిగా ప్రయాణికులు రైలు ఎక్కేందుకు పోటీపడ్డారు. దీంతో ఒక్కసారిగా గందరగోళం తలెత్తింది. పండుగ సీజన్లలో ప్రయాణికుల రద్దీ ఉంటుంది. సీసీటీవీ కెమెరా సెక్యూరిటీ ఫుటేజ్ ప్రకారం బాంద్రా టెర్మినస్ ఫ్లాట్‌ఫాం నెంబర్ 1 నార్త్ ఎండ్ వద్ద రైలు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ తీవ్ర తోపులాటలో ప్రయాణికులు పట్టు తప్పి కిందకు జారారు. రైలు పూర్తిగా ఆగకుండానే ప్రయాణి కులు ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో కొంతమంది గుంపులోనే చిక్కుకుపోయారు. రద్దీని నియంత్రించేందుకు భద్రతా సిబ్బంది ప్రయత్నించినప్పటికీ తగినంతగా సిబ్బంది లేకపోవడంతో ప్రయోజనం లేకపోయింది.

త్వరలో సి-295 విమానాల ఎగుమతి

తయారీ కేంద్రం ప్రారంభించిన ప్రధాని మోదీ

వదోదర (గుజరాత్): భారతదేశంలో సి-295 సైనిక విమానాలు తయారు చేయడానికి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లిమిటెడ్-ఎయిర్‌బస్ నదుపాయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ సోమవారం ప్రారంభించారు. ఇది భారత్-స్పెయిన్ సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' అనే తమ మిషన్‌ను పెంచుతుందని మోదీ చెప్పారు. ఇక్కడ తయారైన విమానాలను భవిష్యత్‌లో ఎగుమతి చేస్తామన్నారు. ఇక్కడి పర్యావరణ వ్యవస్థ భవిష్యత్‌లో పౌర విమానాలు తయారు చేయడానికి భారతదేశానికి సహాయపడుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. సి-295 విమానాలను ఉత్పత్తి చేసే కర్మాగారం భారతదేశ కొత్త పని, సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం రెండేళ్ల క్రితం ఇదే రోజు ప్రారంభమైంది. ఉత్పత్తికి సిద్ధంగా ఉంది' అని మోదీ చెప్పారు. రక్షణ తయారీ పర్యావరణ వ్యవస్థ కొత్త శిఖరాలను తాకుతోందని, 10 సంవత్సరాల క్రితం తన ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్దిష్ట చర్యల కారణంగా భారతదేశం ఈ మైలురాయిని సాధించగలదని ఆయన అన్నారు. 'గత 5 నుంచి 6 సంవత్సరాలలో భారతదేశం దాదాపు 1,000 రక్షణ స్టార్టప్‌లు సృష్టించింది. భారతదేశ రక్షణ ఎగుమతులు 30 రెట్లు పెరిగాయి. మేము ఇప్పుడు 100 దేశాలకు రక్షణ పరికరాలు ఎగుమతి చేస్తున్నాము. వేలాది కొత్త ఉద్యోగాలు ఈ కర్మాగారం కారణంగా సృష్టించాం' అని చెప్పారు. ఈ విమానంలో దాదాపు 18,000 వేర్వేరు భాగాలను సూక్ష్మ, చిన్న పరిశ్రమల ద్వారా దేశవ్యాప్తంగా తయారు చేయనున్నట్లు మోదీ తెలిపారు. భవిష్యత్‌లో రూపకల్పన నుంచి తయారీ వరకు ఈ ఫ్యాక్టరీ భారతదేశం, ప్రపంచం డిమాండ్లను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. వదోదరలో తమ యూనిట్లు నెలకొల్పాలని స్పానిష్ పారిశ్రామికవేత్తలను ఆయన ఆహ్వానించారు. భారతదేశం, స్పెయిన్ మధ్య భాగస్వామ్యం 'శక్తివంతమైనది, నిరంతరం అభివృద్ధి చెందుతోంది' అని అన్నారు. ఈ రెండు దేశాల ప్రజలు 'ఆహారం, చలనచిత్రాలు, ఫుట్‌బాల్' ద్వారా అనుసంధానించబడ్డారని మోదీ తెలిపారు. 'ఇటీవల భారత్ ముద్దు బిడ్డ రతన్ టాటాను దేశం కోల్పోయింది. ఆయన జీవించి ఉంటే నేడు ఇక్కడ మన మధ్యే ఉండేవారు. ఎక్కడ ఉన్నా ఆయన దీనిని చూసి సంతోషిస్తారు' అని మోదీ నివాళి అర్పించారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ మాట్లాడుతూ ఎయిర్‌బస్, టాటా భాగస్వామ్యం భారత వైమానిక రంగ పురోగతికి బాటలు వేస్తుందన్నారు. ఇతర ఐరోపా దేశాలు భారత్‌కు వచ్చేందుకు ఇది ద్వారాలు తెరిచిందని తెలిపారు. ఈ తయారీ విభాగం స్పెయిన్, భారత్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను క్లుప్తంగా వివరిస్తుందన్నారు. టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మాట్లాడుతూ నేటినుంచి కచ్చితంగా రెండేళ్లలో తొలి విమానం డెలివరీ చేస్తామని ప్రధానికి హామీ ఇచ్చారు. ఆ రోజు మళ్లీ ప్రధాని ఇక్కడికి వచ్చి దానిని ఆవిష్కరించేందుకు వీలుగా తేదీని రిజర్వ్ చేసేలా పీఎంవోను కలిసి పనిచేస్తామన్నారు. టాటా గ్రూప్‌నకు చెందిన 200 మంది ఇంజినీర్లు ఇప్పటికే స్పెయిన్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు.

డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై అప్రమత్తం: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో 'డిజిటల్ అరెస్ట్ మోసాలు' రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. సీబీఐ లేదా ఈడీ నుంచి... లేదా పోలీసు అధికారులమంటూ నమ్మించి... ఏదో ఒక నేరంలో ఇరుక్కుపోయినట్టు భ్రమ కల్పించి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుతున్నారు. ఈ తరహా మోసాల సంఖ్య పెరిగిపోతుండడంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఆదివారం దేశ పౌరులకు అవగాహన కల్పించారు. 115వ 'మన్ కీ బాత్' రేడియో ప్రసంగంలో ఈ కుంభకోణంపై మోదీ మాట్లాడారు. జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో డిజిటల్ మోసాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన నివేదిక దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. 2024 ఆరంభంలో దేశంలో భారీగా డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు జరిగాయి. తొలి నాలుగు నెలలు అంటే జనవరి నుంచి ఏప్రిల్ మధ్య జరిగిన 'డిజిటల్ అరెస్ట్' స్కామ్‌ల కారణంగా నేరగాళ్లు మొత్తం రూ.120.3 కోట్లు దోచుకున్నారు. ఈ మేరకు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ 2024 (ఎన్‌సీఆర్‌పీ) మొదటి నాలుగు నెలల్లో జరిగిన సైబర్ నేరాలకు సంబంధించిన నివేదికలో పేర్కొంది. తొలి నాలుగు నెలల్లో దాపు 7.4 లక్షల సైబర్ క్రైమ్ ఫిర్యాదులు అందాయని ఎన్‌సీఆర్‌పీ తెలిపింది. 2023లో మొత్తం 15.56 లక్షల ఫిర్యాదులు అందాయని, 2022లో ఈ సంఖ్య 9.66 లక్షలుగా, 2021లో 4.52 లక్షలుగా ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మొదటి నాలుగు నెలల కాలంలో పెద్ద సంఖ్యలో సైబర్ క్రైమ్‌లు జరిగాయని, ట్రేడింగ్ స్కామ్‌ల పేరిట రూ.1,420.48 కోట్లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల కారణంగా రూ.222.58 కోట్లు, డేటింగ్ స్కామ్‌ల పేరిట రూ.13.23 కోట్లు... ఇలా పెద్ద మొత్తంలో బాధితులు మోసపోయారని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ సీఈవో రాజేశ్ కుమార్ తెలిపారు.

విశాలాంధ్ర హైదరాబాద్

మంత్రి పొంగులేటికి ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి, మర్యాదపూర్వకంగా సీఎంను సోమవారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి బర్త్ డే విషెస్ చెప్పారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్న మవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రికి పొంగులేటి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి పొంగులేటి పుట్టిన రోజు సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, మిత్రులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలం దరూ బొకేలు, శాలువాలు లేకుండానే రావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

బాణసంచా దుకాణంలో అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర - హైదరాబాద్ : బొగ్గులకుంటలోని పరస్ ఫైర్‌వర్క్స్ దుకాణంలో ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో పది ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. గౌలిగూడ నుంచి నాలుగు ఫైర్ ఇంజిన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. క్రాకర్స్‌కు నిప్పు అంటుకుని భారీ శబ్దాలు రావడం, మంటలు ఎగిసిపడటంతో చుట్టు పక్కల ఉన్నవాళ్లు భయాందోళనతో పరుగులు తీశారు. దట్టమైన పొగతో అస్వస్థతకు గురైన ఇద్దరు మహిళలను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు బొగ్గులకుంట చౌరస్తా నుంచి కోఠి బ్యాంక్ స్ట్రీట్ వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు. భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూటా? లేక మానవ తప్పిదమా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. దుకాణం పక్కన ఉన్న బిల్డింగ్‌కు కూడా మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న తాజా టిఫిన్ సెంటర్‌కు సైతం మంటలు వ్యాపించాయి. గౌలిగూడ ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలోని అగ్నిమాపక బృందం మంటలను ఆర్పింది. క్రాకర్స్ కొనుగులుదారుల వాహనాలు కూడా అగ్నికి ఆహుతి కావడం ఆందోళనకు కలిగిస్తోంది.

అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ల నియామకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాన్య నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు (2024-26) కొరకు పార్లమెంట్ వారీగా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్లను నియమించడం జరిగింది. పార్లమెంట్ నియోజకవర్గం ఖమ్మం వాసిరెడ్డి రామనాథం, మహబుబాబాద్ కొండపల్లి రాంచందర్ రావు, భువనగిరి కుందారపు కృష్ణాచారి, మల్కాజిగిరి కందికంటి అశోక్ కుమార్‌గౌడ్, సికింద్రాబాద్ పిన్నమనేని సాయిబాబా, నాగర్ కర్నూల్ వి.రాములు, జహీరాబాద్ పైడి గోపాల్ రెడ్డి, మెదక్ ఇల్లెందు రమేష్, నిజామాబాద్ యాదాగౌడ్, ఆదిలాబాద్ గుళ్లపల్లి ఆనంద్, నల్లగొండ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, పెద్దపల్లి సంజయ్, కరీంనగర్ వంచె శ్రీనివాస్ రెడ్డి, చేవెళ్ల కట్టా వెంకటేష్ గౌడ్, వరంగల్ అర్షనపల్లి విద్యాసాగర్‌రావు, మహబూబ్ నగర్ వెంకటేశ్వర రెడ్డి, హైదరాబాద్ పార్లమెంట్‌కు అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌ను త్వరలోనే నియమించడం జరుగుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఏఎంఓహెచ్‌ను కలిసిన చిరు వ్యాపారులు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గ్రామాల్లో జరిగే సంతలలో రోడ్డుపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు సోమవారం శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాని గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కలిశారు. ఖాజాగూడ ప్రతి మంగళవారం జరిగే సంతలో అధికారులు పెట్టుకోవద్దని అంటున్నారని, తమకి ఉన్న జీవనధారం సంతలో వ్యాపారం చేసుకోవడమే అని తెలిపారు. దీనిపై సాయిబాబా వెంటనే స్పందించి సమస్యను పరిష్కారించడానికి వారిని శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి జోనల్ ఆఫీస్‌కు తీసుకెళ్లారు. జోనల్ కమీషనర్, డిప్యూటీ జోనల్ కమీషనర్ అందుబాటులో లేనందున ఎఎంఓహెచ్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డిని కలిసి చిరు వ్యాపారుల సమస్యను తెలియజేసి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు.

ఈ దారిలో వాటర్ ట్యాంకులకు నియంత్రించండి

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అతి రద్దీగా ఉండే ప్రాంతం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ రోడ్ అలాగే రోడ్డు నెంబర్ 10. రోడ్ నెంబర్ 10 నుంచి గతంలో ఒక షార్ట్‌కట్ రోడ్డును పావని ఈక్వినాక్స్ దగ్గర నిర్మించడం జరిగింది. ఈ దారి నుంచి శ్రీకృష్ణ నగర్, ఇంద్రనగర్‌కు వెళ్లే దారి ఇక్కడ వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. గత రెండు సంవత్సరాల నుంచి బైపాస్ రోడ్డుగా రోడ్ నెంబర్ 10 లో పావని ఈక్వినాక్స్ పక్క నుంచి రోడ్డు నిర్మించడంతో చిన్న, పెద్ద వాహనాలు అన్ని ఈ దారి నుంచి రావడంతో, ఎపుడూ ఏ ఉపద్రవం సంభవిస్తుందో తెలియదు. దీనికి ముఖ్య కారణం, ఈ దారి ప్రక్కనే జూబ్లీహిల్స్ వాటర్ ట్యాంక్ సప్లై జంక్షన్ ఉండడం 5000 లీటర్ల నుంచి పదివేల లీటర్ల సామర్థ్యం గల భారీ వాహనాలు తమకు సులువైన ఇంకా దగ్గరి మార్గం కావడంతో ఇదే దారిని ఎంచుకుంటున్నారు. కానీ రోడ్ నెంబర్ 10 నుంచి చిన్న డౌ నుండి కుడిమలుపు మళ్లడంతో బ్రేక్ ఫెయిల్ లాంటివి ఏమైనా జరిగితే ఏ ఉపద్రవం ఎప్పుడు సంభవిస్తుందో తెలియదు అని ప్రజలు వాపోతున్నారు. ఈ దారిలో రోడ్డు కూడా సరిగా లేకపోవడంతో ప్రజల్లో ఇంకా భయబ్రాంతాలు గురి అవుతున్నారు. దీన్ని గురించి వాటర్ వర్క్స్ మేనేజర్స్‌కి, డిజిఎంకి కూడా విన్నవించిన ఫలితం శూన్యమని, కావున ప్రజల క్షేమం కొరకు ఈ దారిలో, ముఖ్యంగా వాటర్ ట్యాంకర్స్‌ను రానీయకుండా నిలుపుదల చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఏదైనా ఉపద్రవం జరిగినప్పుడే స్పందించి చర్యలు తీసుకోవడం కాకుండా, ముందు జాగ్రత్త చర్యగా స్థానిక అధికారులు చర్యలు చేపట్టాలని అలాగే ఇక్కడ పూర్తిగా వాటర్ ట్యాంకులను నియంత్రించాలని కోరుతున్నారు.

దీపావళికి మట్టి ప్రమిదలు వాడండి

మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : దీపావళి పండగ సందర్భంగా మట్టితో తయారు చేసిన దీపాంతలు వాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముందుగా ఆయన రాష్ట్ర ప్రజలకు దీపావళి పండగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి సందర్భంగా దీపాలు వెలిగించేటప్పుడు మట్టితో తయారు చేసిన దీపాంతలు వాడాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల పర్యావరణానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, కుల వృత్తులను రక్షించినట్టు ఉంటుందన్నారు. బలహీన వర్గాల శాఖ మంత్రిగా మట్టితో తయారు చేసిన వాటికి ప్రాధాన్యత ఇవ్వండని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మట్టి చాయ్ కప్పులు అయినా, మట్టితో తయారు చేసిన వాటర్ బాటిల్స్ వాడుతూ కుమ్మర్లకు ఆర్థికంగా ఉపాధి అవకాశాలు పెరిగేలా అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

అలా చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు :

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ఎవ్వరు డ్యామేజ్ చేయాలని చూసిన ఊరుకునే ప్రసక్తే లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మద్య నిషేధం లేదు కానీ చట్టంలో ఉన్న విధంగా ఫంక్షన్ కార్యక్రమాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రిగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఫామ్ హౌస్ లో భయభ్రాంతులకు గురి చేసే విధంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసి హైదరాబాద్ ఆర్థికంగా దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఫంక్షన్లు చేసుకునేటప్పుడు ఎక్సైజ్ నిబంధనల మేరకు మద్యం అనుమతులు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి మంత్రులకు ఫామ్ హౌస్‌లలో జరుగుతున్న కార్యక్రమాలపై అవసరం లేదు. కానీ అక్కడ జరుగుతున్న ఫామ్ హౌస్‌లో డిస్టబెన్స్‌పై ఫిర్యాదు మేరకే పోలీసులు దాడి చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో అక్కడ అనుమతులు లేని విదేశీ మద్యం దొరికిందని, అందుకే కేసు రిజిస్టర్ చేశారు. దాని తదుపరి జరిపిన పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లు వెల్లడైందని అన్నారు. ఆ తరువాతే నార్కోటిక్ డ్రగ్స్ కేసుగా నమోదు చేశారని కానీ మేము వెళ్లి రాజకీయంగా ఎవరిమీద కేసు పెట్టాలని చూడలేదని స్పష్టం చేశారు. అక్కడ జరుగుతున్న పార్టీపై పోలీసులు కేసు నమోదు చేశారు, అది రాజకీయంగా కేసీఆర్ బావమరిది కావడంతో మీడియా అట్రాక్ట్ అయిందని, కానీ మేము ఏవరం స్పందించ లేదు. మేము స్పందిస్తలేమని స్వయంగా ఈ దేశ హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పోలీసుల మనోధైర్యాన్ని ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బండి సంజయ్ మాట్లాడిన తర్వాత పోలీసులు సమర్థవంతంగా పనిచేయడానికి ఇబ్బంది పడే పరిస్థితి ఎదురవుతుందన్నారు. చట్టాన్ని, న్యాయాన్ని పోలీసులు ఎటువంటి విచక్షణ వివక్ష లేకుండా దర్యాప్తు చేయాలని కోరారు. అర్ధరాత్రి డిజె సౌండ్ పెట్టి పక్క వాళ్లకు ఇబ్బంది కలిగే ప్రయత్నం చేస్తే పోలీసులు అక్కడికి వెళ్లి దాడి చేశారని, అది విఐపి బామ్మర్ది కావడం వల్ల మీడియా అక్కడికి వెళ్లిందన్నారు. ఇపుడు కొంతమంది ఇందులో ముఖ్యమంత్రి, మంత్రుల కుట్ర ఉందని అంటున్నారని అసలు మా ప్రభుత్వానికి ఎవరి మీద కక్ష సాధింపు చర్యలు లేవని తెలిపారు. మీ కన్నా మంచిగా ఈ ప్రభుత్వాన్ని నడిపి ప్రజల్లో ప్రశంసలు పొంది ప్రయత్నం చేస్తున్నామని, ప్రజల దృష్టి మళ్లించడానికి కక్ష సాధింపు ధోరణి అని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలకు రాజకీయ కక్షలు ఉంటాయి జాతీయ పార్టీలకు రాజకీయ కక్షలు ఉండవని, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఫామ్ అవుతులలో స్వేచ్ఛగా విందు వినోదాలు చేసుకోవచ్చు కాని ఇలాంటి అశ్లీలత లేకుండా మాదక దవ్యాలకు తావు లేకుండా మద్యపానం అనుమతులు తీసుకొని విందులు చేసుకోవచ్చన్నారు. మీరు అనుమతులు తీసుకోకుండా విదేశీ మద్యం వాడుతూ అర్ధరాత్రి డిజె సౌండ్స్ పెట్టి ఇబ్బందులు పెట్టడమే కాకుండా బట్ట కాల్చి మీద వేయడమెంటని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నాడు మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పు చేసి చిప్ప చేతికిచ్చి పోయారని ధ్వజమెత్తారు. మీరు 7 లక్షల కోట్ల అప్పు చేసిన ఒకటో తారీకు జీతం ఇవ్వలేదని దుయ్యబట్టారు. 2022 నుండి ఒకడిఏ కూడా ఇవ్వలేదు, మేము డిఎ ప్రకటించామని, గురుకుల భవనాలకు కిరాయిలు ఇవ్వలేదు మేము ఇచ్చామన్నారు. హాస్పిటల్లో మీరు పెట్టిన బకాయిలకు మేము పెండింగ్ లు క్లియర్ చేసామని, రైతు రుణమాఫీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 500 కి గ్యాస్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని, రేవు పార్టీలకు మాదకద్రవ్యాలకు అనుమతి లేదని మరో సారి ఆయన స్పష్టం చేశారు.

ప్రజావాణి ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి డిప్యూటీ మేయర్ జిహెచ్ఎంసి ఉన్నతాధికారులతో కలిసి విజ్ఞప్తులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆయా అధికారులకు సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని, పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఆయా విభాగాలకు అందిన అర్జీలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా నాలుగు విన్నపాలు రాగా సంబంధిత అధికారులకు పరిష్కారానికై పంపించడం జరిగింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 88 విన్నపాలు రాగా అందులో అత్యధికంగా హౌసింగ్/లేక్స్ విభాగానికి 43, టౌన్ ప్లానింగ్ 23, ట్యాక్స్ సెక్షన్ 8, ఈ.ఎన్.సి 3, ఎల్.డబ్ల్యు.ఎస్, ఎఫ్.ఎ, శానిటేషన్ విభాగాలకు 2 చొప్పున, సి.ఎం అండ్ హెచ్.ఓ, ఎలక్ట్రికల్, ఎస్టేట్స్, వెటర్నరీ, హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.ఎస్.బి విభాగాలకు ఒకొక్కటి చొప్పున విన్నపాలు వచ్చాయని తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 89 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 42, శేరిలింగంపల్లి జోన్‌లో 16, సికింద్రాబాద్ జోన్ లో 14, ఎల్బీనగర్ జోన్‌లో 9, చార్మినార్ జోన్‌లో 6, ఖైరతాబాద్ జోన్‌లో 2 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, యాదగిరిరావు, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, సత్యనారాయణ, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి గంగాధర్, చీఫ్ వెటర్నరీ అధికారి డా.అబ్దుల్ వకీల్ ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అనుమతులు లేని బాణసంచా విక్రయాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : అనుమతిలేని బాణసంచా తయారీ అలాగే నిల్వచేయడం ఇంకా అమ్మకంపై కఠిన చర్యలు తీసుకుంటామని జూబ్లీహిల్స్ ఏసీపి పి. వెంకటగిరి హెచ్చరించారు. దీనికి సంబంధించి మంగళవారం పలు నిబంధనలతో కూడిన పత్రికా ప్రకటన విడుదల చేశారు. అగ్నిప్రమాదాల నియంత్రణకు షాపు యజమానులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. బాణాసంచాను అనుమతి లేకుండా తయారుచేసినా, నిల్వ ఉంచిన, అనుమతులు లేని విక్రయాలు చేసినా కఠినచర్యలు తప్పవని ఏసీపి హెచ్చరించారు. లైసెన్సులు ఉన్నవారు మాత్రమే బాణాసంచా విక్రయాలు జరపాలన్నారు. శాశ్వత లేదా తాత్కాలిక బాణాసంచా లైసెన్సులు కలిగినవారు వారికి నిర్దేశించిన ప్రదేశాల్లో, షాపుల్లో మాత్రమే విక్రయాలు జరపాలని ఏసీపి సూచించారు. జనావాసాలకు, విద్యాసంస్థలకు, ఆసుపత్రులకు దూరంగా మాత్రమే విక్రయాలు జరపాలన్నారు. ప్రమాదాల నివారణపై తీసుకోవలసిన జాగ్రత్తలపై రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు నిర్దేశించిందని, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రతాప్రమాణాలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలని ఏసీపి పలు సూచనలు చేశారు. చిన్నపిల్లలు బాణాసంచా కాల్చే సమయాల్లో తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. దీపావళి పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఏసిపి వెంకటగిరి తెలిపారు.

అతిపెద్ద స్టోర్‌తో విస్తరించిన మిఆ బై తనిష్క్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : భారతదేశంలో అత్యంత అధునాతన, విలువైన ఫైన్ జ్యువెలరీ బ్రాండ్‌లలో ఒకటైన మిఆ బై తనిష్క్, పండుగ సీజన్‌కు ముందు హైదరాబాద్‌లోని తమ అతిపెద్ద బ్రాండ్ స్టోర్‌ను ప్రారంభించింది. ఈ కొత్త స్టోర్‌తో, మిఆ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 11 స్టోర్ లను కలిగి ఉంది. మిఆ బై తనిష్క్ సౌత్-3, రీజనల్ బిజినెస్ మేనేజర్ వాసుదేవరావు ఈ స్టోర్‌ను ప్రారంభించారు. మిఆ బై తనిష్క్ ఈ నూతన స్టోర్- కల్కి టవర్స్, గంగారం, చందానగర్ వద్ద ఏర్పాటు చేయబడినది. పండుగ సీజన్ వేళ జరిగిన ఈ ప్రారంభం, అందుబాటు ధరలలో, వ్యక్తిగతీకరించిన షాపింగ్ అనుభవాలను అందించడంలో బ్రాండ్. పండుగ కొనుగోళ్లకు సరైన గమ్యస్థానంగా నిలుస్తుంది. కొత్తగా ప్రారంభించబడిన స్టోర్‌లో 31 అక్టోబర్ 2024 వరకు 20శాతం వరకు తగ్గింపుతో సెలబ్రేటరీ ఆఫర్‌ను అందిస్తున్నారు. ఈ స్టోర్‌లో విస్తృత శ్రేణి అధునాతన సమకాలీన ఆభరణాల డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయి. మిఆ బై తనిష్క్, సౌత్-3, రీజినల్ బిజినెస్ మేనేజర్ వాసుదేవరావు మాట్లాడుతూ, నగరంలోని ఆధునిక ఫ్యాషన్-పరంగా ముందున్న కస్టమర్ల స్ఫూర్తితో హైదరాబాద్‌లో మా 11వ స్టోర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, ఈ. వెంకట చారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 268 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అట్టి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 268 దరఖాస్తులు రాగా గృహ నిర్మాణ శాఖకు 218, పెన్షన్లు 19, భూ సమస్యలకు సంబంధించినవి 02, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ 04, జిల్లా ఉపాధి అధికారి 06 ఇతరములు 19 దరఖాస్తులు వచ్చినవని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు జి ఆశన్న, పవన్ కుమార్, డాక్టర్ సురేందర్, ఇలియాజ్ అహ్మద్, ఒడ్డెన్న, ఆర్. రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలు సత్వరమే పరిష్కరించాలి : మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్ రావు, డిఈ సాయినాథ్ గౌడ్, రెవిన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ దమ్ముంటే వివరాలు బయటపెట్టు : షబ్బీర్ అలీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జన్వాడలో కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్ హౌస్?లో జరిగిన రేవ్ పార్టీ ఘటనపై మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్పందించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ బామ్మర్ది ఫామ్ హౌస్‌లో దొరికిన డ్రగ్స్, లిక్కర్, అమ్మాయిలు, అబ్బాయిల వివరాలు అన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ముందుగా కేటీఆర్ నార్కో టెస్ట్ చేయించుకోవాలని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. ప్రతి వారం కేటీఆర్ బామ్మర్ది రేవ్ పార్టీ పెడుతున్నారని పోలీసులకు సమాచారం ఉందని పక్కా ఇన్ఫర్మేషన్‌తోనే పోలీసులు దాడి చేశారని తెలిపారు. గతంలో జన్వాడ ఫామ్ హౌస్‌కు నాకు సంబంధం లేదు అన్నావ్, హైడ్రా ఎపిసోడ్‌తో నా దోస్త్ ఫామ్ హౌస్ అన్నావ్, ఇప్పుడేమో మా బామ్మర్ది ఇల్లు అంటున్నావ్, కేటీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలేనని విమర్శించారు. పార్టీలో లీటర్ లిక్కర్, 6 బీర్లు మాత్రమే ఉండాలని ఎక్సైజ్ నిబంధనలు ఉన్నాయన్నారు. కానీ ఆ పార్టీలో పెద్ద ఎత్తున మద్యం పట్టుబడిందని, చట్టం తెలిసిన వ్యక్తులే తప్పులు చేస్తే పోలీసులు కేసులు పెట్టక పోతే ఏం చేస్తారని నిలదీశారు. జన్వాడ ఫామ్ హౌస్ ఘటనపై త్వరలో వాస్తవాలు అన్ని ప్రజల ముందు పెడతామని స్పష్టం చేశారు. గతంలో జన్వాడ ఫామ్ హౌస్‌పై డ్రోన్ ఎగరేసి వాస్తవాలు బయటపెట్టినందుకు చిన్న పిట్టి కేసులో ఆ రోజు ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ప్రభుత్వం 40 రోజులు జైల్లో పెట్టిందని తెలిపారు. అండర్ ట్రయల్ ముద్దాయిగా జైల్లో పెట్టి రేవంత్ రెడ్డిని చంపాలని చూశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆనాడు జైల్లో రేవంత్‌రెడ్డి హత్యకు కుట్ర చేస్తే ప్రజల అతడిని ముఖ్యమంత్రిని చేశారన్నారు. కేటీఆర్ హవాయి చెప్పల్ నుండి హవాయి జహాజ్ వరకు ఎదిగారు. ఈ ఆస్తులన్నీ ఎక్కడి నుండి వచ్చాయో కేటీఆర్ ఆస్తులపై ప్రభుత్వం విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసు విచారణలు అన్ని సీఎం క్యాంప్ ఆఫీసులో జరిగాయని అసలు కేసీఆర్ ఏమైనా జడ్జా అని ప్రశ్నించారు.

మూడు నెలలకోసారి ఎస్సీ, ఎస్టీల సమస్యలపై సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి లైజన్ ఆఫీసర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించాలని, ప్రమోషన్లు, పోస్టింగులలో ఈ వర్గాలకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి ఎన్.బలరామ్, కమిషన్ సభ్యులు, సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు, ఉద్యోగ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ అధికారులకు ప్రమోషన్లు కల్పించే కమిటీలలో, రక్షణ కమిటీలలో ఎస్సీ, ఎస్టీ కులాల నుంచి కనీసం ఇద్దరిని సభ్యులుగా చేర్చాలని సూచించారు. తద్వారా ఆ కులాల వారికి అన్యాయం జరగకుండా చూసి అవకాశం ఉంటుందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి బాబా సాహెబ్ అంబేద్కర్ జాతికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన విగ్రహాలను ప్రతీ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఈ విషయంలో ప్రభుత్వం తరపున మాట్లాడి సహకరిస్తామని వివరించారు. సింగరేణి సంస్థ చైర్మన్‌గా ఉన్న ఎన్. బలరామ్ ఇప్పటికే అన్ని రకాల సమస్యలను సమర్థంగా పరిష్కరిస్తున్నారని, కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యలను కూడా పరిష్కరించాలని సూచించారు. అలాగే సంస్థ చైర్మన్ ఎండి ఎన్.బలరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కమీషన్ చైర్మన్ సూచించిన విధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి సింగరేణీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో పేర్కొన్న ప్రతి సమస్యను తాను నమోదు చేసుకున్నామనీ, నిబంధనలు మేరకు అన్ని సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. కమిషన్ సూచన మేరకు సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల లైజన్ సెల్ కార్యాలయాన్ని కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో ఏర్పాటు చేశామని, నవంబర్ 12వ తేదీన దీనిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశం ప్రారంభంలో అన్ని ఏరియాల నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు వివిధ రకాల ప్రమోషన్లు, బదిలీలలో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. అనేక వ్యక్తిగత, ఉద్యోగ సమస్యలు కూడా కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను తిరిగి కమిషన్ వారు సంస్థ చైర్మన్ కు వివరించారు వీటిపై నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్‌తో పాటు సింగరేణి సంస్థ నుండి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ పర్సనల్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ ఎస్.డి. ఎం.సుభాని, జీఎంలు శామ్యూల్ సుధాకర్, కవిత నాయుడు, మిస్ బెనడిక్ట్ నికోలస్, ఎస్సీ చీఫ్ లైజన్ ఆఫీసర్ దుర్గం రాంచందర్, ఎస్టి చీఫ్ లైజన్ ఆఫీసర్ వీసం కృష్ణయ్య, జీఎంలు సురేష్ బాబు, బండి వెంకటయ్య, సూర్యనారాయణ, డీజీఎం పర్సనల్ అజయ్ కుమార్ ఇంకా సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘాల నాయకులు, ఏరియాల లైజన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

Notice

IN THE COURT OF THE PRL. DIST.JUDGE:: GUNTUR

M.V.O.P.No.633/2019

Between:
Chimata Navya Sree& Others - Petitioners
And
G Shankar& Others - Respondents
To,
R-2: K. Sambi Reddy,
S/o.Sitaram Reddy, D.No.1-101, Ramachandra Puram, RCPURAM (V) & (M), Medak Dt.,Telengana-502319, (Owner Of Lorry Bearing No. AP 23 W 1006) .

పై నెంబరు ఓ.పి.లోని పిటీషనర్లు యాక్సిడెంటులో చిమట మల్లికార్జున రావు మరణించినందున నష్టపరిహారం కొరుచూ దాఖలు చేయగా సదరు పిటీషనులో 2వ రెస్పాండెంట్ అయిన మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది.20-11-2024కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం. 10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొన వలసినది. లేనిచో మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

వాయిదా తేది:20-11-2024

వై. రిషికేష్ రెడ్డి, పిటీషనర్లు తరపు న్యాయవాది, గుంటూరు, సెల్: 94405 77242.

మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్న కేటీఆర్

ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మంత్రిగా పనిచేసిన కేటీఆర్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడి చట్టాలు తెలియకుండా మాట్లాడి నవ్వుల పాలు అవుతున్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేటీఆర్ బావమరిది రాజ్ పకాల ఇంట్లో సోదాలు జరిగాయని, మంత్రిగా పని చేసిన వ్యక్తికి ఎక్సైజ్ అధికారులు ఎలా తనిఖీలు చేస్తారో తెలియకపోవడం సిగ్గు చేటని అన్నారు. సోమవారం నాడు సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంట్లో పార్టీ చేసుకున్న లిమిట్ కి మించి మద్యం ఉపయోగిస్తే పర్మిషన్ తీసుకుంటారనే విషయం కేటీఆర్‌కు తెలియదా అన్నారు. 111జీఓతో ఇల్లు ఎలా కట్టుకున్నారు, గృహ ప్రవేశ వేడుకలో లిక్కర్ సర్వ్ చేసేందుకు పర్మిషన్ తీసుకోవాలి కదా అని అడిగారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందిగా ఉంటే ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తారన్నారు. లిక్కర్ బాటిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయని, అనేది పరిశీలిస్తే అడ్డంగా దొరికారని చెప్పారు. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేయడానికి వారెంట్ అవసరం లేదని, ఎన్ డిపిస్ యాక్ట్‌లో నార్కోటిక్స్ కంట్రోల్ చేయడానికి వారికి అధికారం ఉంటుందని పేర్కొన్నారు. అసలు రేవ్ పార్టీ అని ఏ అధికారి చెప్పలేదని, ప్రభుత్వం, సీఎం మీద ఎందుకు విరుచుకుపడుతున్నారని అన్నారు. తెలంగాణలో కోవర్ట్ ఆపరేషన్ లు మీ వేలుబడిలో వచ్చినవే కాదా అని నిలదీశారు. జూబ్లీహిల్స్ లో హై లైఫ్ పబ్ కి ఓనర్స్ షిప్ లో రాజ్ పాకలకు భాగం ఉందని, రాజ్ పాకాల పర్మిషన్ ఇప్పించిన అనేక పబ్బుల్లో డ్రగ్స్ సరఫరా జరిగేదన్నారు. గోవాలో కూడా సన్ బర్న్ రద్దు చేశారని, అటువంటి సన్ బర్న్ ఈవెంట్ హైదరాబాద్ లో చేసేందుకు ఒప్పందం చేసుకుంటే ప్రజా సంఘాలు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఇటీవల జరిగిన దాడిలో ఒకరికి డ్రగ్ టెస్ట్ చేస్తే ఒకరికి పాజిటివ్ వచ్చిందని, అంటే అధికారులను వారి విధులు సక్రమంగా నిర్వహించారు అని అభినందించాలన్నారు. ఓనర్ లేకుండా అతిథులు వస్తారా..? పార్టీ జరుగుతుందా అనే విషయం ప్రశ్నించారు. రాజ్ పాకాల కు నార్కోటిక్స్ టెస్ట్ చేస్తే పాజిటివ్ స్తుంది అనే భయంతోనే తప్పించుకుని ముందుస్తు అరెస్ట్ నుండి తనను కాపాడుకోవడానికి కోర్టులో పిటిషన్ వేశారని, తప్పించుకొని తిరుగుతున్నాడని పేర్కొన్నారు. పదేళ్లు పాలించిన వాళ్ళు చట్టం ముందు ఉదాహరణగా ఉండాలన్నారు. రాజ్ పాకాల పారిపోకుండా ఉంటే కేటీఆర్ చెప్పే మాటలకు అర్థం ఉండేదని కానీ రాజ్ పాకాల కూడా డ్రగ్స్ సేవించారు అనే అనుమానం ప్రజలకు కల్గుతుందన్నారు. ఇందులో రేవంత్ రెడ్డి ఇతరుల ప్రమేయం ఎలా ఉంటుందో చెప్పాలన్నారు. మూసీ డీపీఆర్ కాలేదు, అప్పుడే అవినీతి బయటపడుతుందని అందుకే జన్వడా పార్టీని తెరపైకి తెచ్చారని హరీష్ రావు అనడం విడ్డురంగా ఉందన్నారు. కాళేశ్వరం, విద్యుత్, భూదాన్ భూముల స్కాం లు బయటకి వస్తున్నాయని చెప్పారు.

విజయ్ మద్దూరికి రాజ్ పాకాల డ్రగ్స్ ఇచ్చాడని స్టేట్మెంట్ ఇచ్చాడని, ఇది నిజం కాకపోతే రాజ్ పాకాల లొంగిపోయి స్టేట్మెంట్ తప్పు అని చెప్పాలని సూచించారు. ఎదురు దాడి అన్నింటిలో పనికి రాదు కేటీఆర్ అని సలహా ఇచ్చారు. మీ బావమరిది నీ వెనకేసుకు రకండి ఇది రాజకీయ సమాధి చేసుకున్నట్లు అవుతుందన్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్కని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందచేస్తున్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

యాదవుల సంస్కృతికి ప్రతీక సదర్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : యాదవుల సాంస్కృతిక ప్రతీక 'సదర్' అని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పేర్కొన్నారు. రాజకీయ, కుల మతాలకు అతీతంగా మాజీ ఎం పి అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ గ్రౌండ్ లో నిర్వహించిన యాదవ్ సమ్మేళనంలో కార్పొరేటర్ విశిష్ట అతిధులుగా పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేబినెట్ బృందం పాల్గొన్నారు. నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు కనుల పండుగగా నిర్వహించే సదర్.. దీపావళి సందర్భంగా ఏటా జరుగుతుందని, జంట నగరాల్లో అన్ని ప్రాంతాల్లో సదర్ జరుగుతుందన్నారు. రాజు యాదవ్, రాగం అభిషేక్ యాదవ్, గడ్డం రవి యాదవ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, కిరణ్ యాదవ్, శివరాం యాదవ్, హరీష్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత రాజకీయాలకు ప్రత్యామ్నాయం తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ప్రస్తుత రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా తమ పార్టీ అవతరించబోతుందని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలుకర రవికుమార్ స్పష్టం చేశారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీల నాయకులు ప్రజలను ప్రలోభాలు పెట్టి అధికార రావడం కోసం ఎంతకైనా దిగజారుతున్నారని తమ పార్టీ వాటికి విరుద్ధంగా ఉంటుందన్నారు. యువత రాజకీయాల వైపు రాణించేలా తమ పార్టీ తరుపున ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలో వచ్చి నేటికీ హామీల అమల్లో పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా తమ పార్టీ తరపున రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. నవంబర్ నెలలో హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి తమ పార్టీ విధి విధానాలను ప్రకటిస్తామని వెల్లడించారు. ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పార్టీలు, ప్రభుత్వాలు పని చేయాలని అన్నారు. అప్పుడే ప్రజలకు రాజకీయాలపై విశ్వాసం కలుగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా పార్టీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, రానున్న ఎన్నికల్లో అధికారమే రావడమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. తప్పుడు హామీలతో కాలం వెళ్లదీస్తున్న పాలకులకు ప్రజలు తగ్గిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. 2028 వరకు రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదుగుతాం అని అన్నారు. ఈ కార్యమంలో దాసరి శ్యామ్ రావు, సోమయ్య, బి.రవికుమార్, నరేందర్, రత్న రాజ్, జి శైలేష్, బంగారి రమేష్, జ్ఞానేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో 20 లక్షల నిధులతో సిసి రోడ్డుకు సోమవారం ఉదయం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జడిగే మహేందర్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, మున్సిపల్ అధికారులు మరియు కాలనీ వాసులు పాల్గొనడం జరిగింది.

మూసీ సుందరీకరణకు జేఏసీ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : మూసి సుందరీకరణ కోసం అన్ని పార్టీలతో జాయింట్ యాక్షన్ కమిటీ వేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూసి సుందరీకరణ డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) విడుదల చేయాలని కోరారు. మూసి భాధితులకు పూర్తి పరిష్కారం చూపించిన తరువాతే వారిని వేరే ప్రాంతానికి తరలించాలన్నారు. చేరువులను రక్షించడం, నాలాల కబ్జాలు అరికట్టడం, మూసి సుందరీకరణ మంచిదే, కానీ పేద ప్రజల అర్ధంతరంగా రోడ్డున పడేసి వారి బ్రతుకులను చిదిమేయడం సరికాదన్నారు. వారికి పరిష్కారం చూపి, తగు ఏర్పాట్లు చేసి చేయాలన్నారు. పేద ప్రజల ఇళ్ళను కూల్చితే ఆమ్ ఆద్మీ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. పార్టీ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాములు గౌడ్, మహమ్మద్ మాజీద్, మహిళా వింగ్ అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు లక్ష్మా నాయుడు, దివ్యంగా కమిటీ అధ్యక్షులు రమేష్ దర్శనం, అధికార ప్రతినిధులు జావీద్ షరీఫ్, ఖలీం బాబా, కొడంగల్ శ్రీనివాస్, మూసి భాధితుల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ అఫ్సా సలాం, వైస్ చైర్మన్ సుధా రాణి పాల్గొన్నారు.

శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ 16 వార్డ్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే కెపి.వివేకానందని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సంతోషం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డికి హృదయపూర్వకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలని ఎంపీడీఓకు వినతి

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలో రోడ్డు విస్తరణలో వ్యాపారులను కోల్పోయి వీధుల పాలయ్యామని, రోడ్డు ఇరువైపుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి తమను ఆదుకోవాలని చిరు వ్యాపారుల సంఘం నాయకులు ప్రభుత్వానికి, ఎంపిడిఓ కుసుమ మాధురికి విజ్ఞప్తి చేశారు. సోమవారం చిరు వ్యాపారులు ఎంపిడిఓ కార్యాలయంలో సమస్యలను వివరించారు. దశాబ్దాల కాలంగా ఆమనగల్లు పట్టణంలో శ్రీశైలం, హైదరాబాద్ మాద్గుల, షాద్నగర్ రోడ్లకు ఇరువైపులా డబ్బాలు వేసుకుని చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి రోడ్డు వెడల్పుతో వారి జీవితాలు చిద్రమైపోయాయన్నారు.రోడ్డుపై చిరువ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తమను ఆదుకోవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా తమ గోడు అరణ్య రోధనగానే మిగిలిందని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డబ్బాల వెనుక ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమర్పించిన వినతి పత్రాలను ఎంపిడిఓ కుసుమ మాధురికి అందజేశారు. చిరు వ్యాపారులు గాజుల శ్రీనివాస్, అజీమ్, అలీమ్, రవి, యాదగిరి, పురోషోత్తం, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ విలేజ్‌లో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - కాప్రా : నాచారంలో రోడ్డు నిర్మాణానికి 54 లక్షల రూపాయలు మంజూరు చేయించినందుకు నాచారం గ్రామ పెద్దలు భూపాల్ రెడ్డి, సాయిబాబా, యాదగిరి గౌడ్, భరత్ ప్రశాంత్ తదితరులు నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌కి కృతజ్ఞతలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. నాచారం ఓల్డ్ విలేజ్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల కొరకు 30 లక్షల 50 వేల రూపాయలు నిధులు మూడు సంవత్సరాల క్రితం మంజూరయ్యాయి. దీనికి సంబంధించి శిలాఫలకం కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కానీ నాచారం ఓల్డ్ విలేజ్లో భూగర్భ డ్రైనేజీ లేకపోవడంతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. సుమారు కోటి రూపాయల నిధులతో నాచారం ఓల్డ్ విలేజ్లో పూర్తిగా భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగింది. డ్రైనేజీ నిర్మాణాల తర్వాత రోడ్లు ప్రారంభించమని అధికారులకు కార్పొరేటర్ తెలియజేయడంతో 30 లక్షల 50 వేల రూపాయల ఫండ్స్ రిటన్ వెళ్లిపోయాయని అధికారులు చెప్పడంతో కార్పొరేటర్ ఆగ్రహం చెందారు. వెంటనే జోనల్ కమిషనర్‌ను కలిసి మంజూరైన 30 లక్షల 50 వేల రూపాయలు క్యాన్సిల్ అయ్యాయి దానికి బదులుగా పూర్తి నాచారం ఓల్డ్ విలేజ్లో 54 లక్షల రూపాయల కొత్త ఫండ్ శాంక్షన్ చేయాలని ఎమ్మెల్యేని జోనల్ కమిషనర్‌ని కోరడంతో అక్టోబర్ 2న 54 లక్షల రూపాయలకు మంజూరు వచ్చింది. టెండర్ దక్కించుకున్న వ్యక్తికి తొందర్లోనే అగ్రిమెంట్ చేసి పనులు ప్రారంభించాలని కార్పొరేటర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొత్తూరు : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి ఎంపిడివో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు వారితో వెట్టి చాకిరి చేయించుకొని పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఎనిమిది గంటలు పని చేయించుకోవాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించడంతో పాటు వారికి పర్మనెంట్ గుర్తింపు కార్డు ఇవ్వాలని, అంతేకాకుండ వారాంతపు సెలవులు, పండుగలకు సెలవులు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్మికులకు పనికితగ్గ కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని అన్నారు. అదే విధంగా ప్రతి నెల చేతులకు బ్లౌజులు, కాళ్లకు బూట్లు, సబ్బులు, సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల కార్మికుల పక్షాన ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి శేఖర్ రెడ్డి, గ్రామపంచాయతీ వర్కర్స్ పి వసంత, పి యాదమ్మ, సురేష్, దేవయ్య, బిక్షపతి, జంగయ్య, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ బీఎస్పీ ప్రధాన కార్యదర్శిగా తుప్పరి కుమార్

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా తుప్పరి కుమార్ నియమితులయ్యారు. షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలోని వెల్ జర్ల గ్రామానికి చెందిన తుప్పరి కుమార్ ఈ పదవిలో నియమితులయ్యారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి దొడ్డి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు సొంటే శ్రీనివాస్, సీనియర్ నాయకులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ బలోపేతానికి తన వంతుగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టపడే నాయకులకు పార్టీ గుర్తింపు ఉంటుందని, తన నియామకానికి కారకులైన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కమిటీలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నియామకం షాద్‌నగర్ బహుజన్ సమాజ్ పార్టీకి కొత్త శక్తి చేకూర్చే అవకాశం కల్పించారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుండేటి నర్సింలు, మణుగూరు రాంప్రసాద్ గౌడ్, గాదెపాక మోజెస్, ఎర్ర రాధాకృష్ణ, కొండేటి మహేందర్, శివగల ఆంజనేయులు, నీరటి రాజు, కొండేటి శరత్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుంటున్న శ్రీకృష్ణా యూత్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : సమాజ సేవలో శ్రీ కృష్ణా యూత్ ఎల్లపుడు ముందడుగు వేస్తూ ముందుకు సాగుతోందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. శ్రీ కృష్ణ యూత్ ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులను, వైద్యులను అభినందించారు. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఎంతో మంది వ్యాధిని గుర్తించలేక వైద్యానికి దూరమవుతూ అనేక రోగాల బారిన పడుతున్నారని, రోగికి వచ్చిన వ్యాధిని గుర్తించలేక హాస్పిటల్‌కి వెళ్లే స్తోమత లేక దుర్భరమైన జీవితం గడుపుతూ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. కుటుంబ పోషణలో భాగంగా రోజు కూలి పనులకు వెళ్లి సరైన ఆహారం లేక ఈ కాలుష్యం వలన రోగాల బారిన పడుతున్నారని, అలాంటి వారికి వెన్నుదన్నుగా శ్రీ కృష్ణా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య సేవలు అందించడం చాలా గొప్ప పరిణామం అని అన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ మద్యపానానికి దూరంగా ఉండాలని చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తక్షణమే స్పందిస్తామని హామీనిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తమ అంతిమ లక్ష్యం అని, శ్రీ కృష్ణ యూత్ సభ్యులు ఎప్పుడు ఇలాంటి మరిన్ని సేవ కార్యక్రమాలతో ముందుకు సాగాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు అవసరం ఉన్న అన్ని రకాల వైద్య సేవలను అందించాలని అందుకు మా వంతు సహకారం ఉంటుందని అపోలో హాస్పిటల్స్ డాక్టర్లను కలిసి వివరించారు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ ఈ కార్యక్రమంలో నాయకులు పల్లపు సురేందర్, అనిల్, రోహిత్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి, శ్రీ కృష్ణ యూత్ చైర్మన్ పి.శ్రీనివాస్ రెడ్డి, శ్రీ కృష్ణ యూత్ రాష్ట్ర ప్రెసిడెంట్ అభిషేక్ గౌడ్, నల్లగండ్ల ప్రెసిడెంట్ ఆదిత్య ముదిరాజ్, హనుమంతు, సతీష్ చారి, శివనంద రెడ్డి, ప్రతిష్ యాదవ్, కిరణ్, అంకుష్ సింగ్, సాయినాథ్, శ్రీకాంత్ యాదవ్, సంగమేష్, గోపాల్, దేవేందర్, ముర్తుజ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి శాసన సభ్యులు మేఘరెడ్డి, గద్వాల్ శాసనసభ్యులు కృష్ణమోహన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్‌ఓతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (71) ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

అక్రమ నిర్మాణాలు

టౌన్ ప్లానింగ్ నిబంధనలకు నీళ్లొదిలేసిన అక్రమార్కులు

చోద్యం చూస్తున్న అధికారులు, సిబ్బంది

విశాలాంధ్ర-దుండిగల్ : గాగిలాపూర్‌లో నిబంధనలను గాలికివదిలేసి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న నిర్మాణదారులకు దుండిగల్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సలాం కొడుతున్నారు. కొందరు ముష్కరుల ముఠా ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మాణం చేపడుతున్న ఇక్కడి అధికారులకు కొసమెరుపు చలనం లేకపోవడం, కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.కళ్ళ ముందు వందల పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న పట్టింపులేని వీరి తీరు నిత్యం పలు విమర్శలకు దారితీస్తుంది. వివరాల్లోకి వెళితే దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గాగిల్లాపూర్ నుండి దుండిగల్ విలేజ్ కు వెళ్లే దారిలో అనుమతులు లేని అక్రమ నిర్మాణమే ఇందుకు నిదర్శనం. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అనుమతులు తుంగలో తొక్కుతూ ఆకాశానందేలా అదనపు అంతస్తులతో ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్న ఇదంతా తమకేమీ పట్టనట్టు టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది దర్జాగా వ్యవహరిస్తున్నారు. ఇదే విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసిన నామ మాత్రంగా సమాధానం చెబుతూ సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు తప్ప, అక్రమాలపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రజలు కడుతున్న పనుల్లోంచి నెలకు వేళల్లో జీత బత్యాలను ఇతర సౌకర్యాలను పొందుతూ, అక్రమాలకు పాల్పడుతున్న ముష్కరులను పెంచి పోషించేలా లక్షల రూపాయలను దండుకుంటూ సొమ్ము చేసుకునేందుకు పరుగులెడుతున్న వీరి వ్యవహార శైలియే స్థానిక అక్రమాలకు పరాకాష్టగా నిలుస్తుంది.నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలపై కొరడా జులిపించి మున్సిపల్ రాబడికి ఆదాయాన్ని సమకూరుస్తూ అక్రమార్కులపై కేసులు నమోదు చేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులే, ప్రభుత్వం నుండి జీతభత్యాలు సేకరిస్తూ ఇటు నిర్మాణదారులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుంటూ ముసిముసి నవ్వులతో విధులను నిర్వీర్యం చేసే కంకణం కట్టుకుంటున్నారని స్థానిక పౌరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు మార్చుకొని ఇకనైనా ప్రజల సొమ్మును బూడిదలో పోసిన పన్నీరు చందంగా కాకుండా, పౌరులను మేల్కొల్పేలా వారికి అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆధిపత్యానికి సంస్కృతి, ఫాసిజం సాధనాలు

- వర్గ పోరాటం చేసేవారే ఫాసిజాన్ని ఎదుర్కోగలరు
- రాఘవాచారి స్మారకోపన్యాసంలో ప్రొఫెసర్ కాశీం

విశాలాంధ్ర-విజయవాడ: ప్రపంచ దేశాలలో మానవ, ఆర్థిక వనరులపై ఆధిపత్యం సాధించటానికి సామ్రాజ్యవాదులకు ఆయా దేశాల సంస్కృతి, ఫాసిజం సాధనాలుగా ఉన్నాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సి.కాశీం అన్నారు. 'సంస్కృతి- ఫాసిజం' అంశంపై అక్షర శస్త్రధారి, విశాలాంధ్ర పూర్వ సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి 5వ స్మారకోపన్యాసం చేశారు. సి.రాఘవాచారి ట్రస్ట్ అధ్వర్యాన స్థానిక సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో సోమవారం ట్రస్ట్ సభ్యుడు అక్కినేని చంద్రరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కాశీం మాట్లాడుతూ మనిషి పుట్టిన నాటి నుంచి చనిపోయే వరకు జరిగే ఆలోచనలు, ఆచరణలే వ్యక్తి సంస్కృతి అన్నారు. ఆహారం, వస్త్రధారణ, ఆచారాలు అన్నీ సంస్కృతిలో భాగాలన్నారు. పాలకుల సంస్కృతి, పాలితుల సంస్కృతి వేరువేరుగా ఉంటుందన్నారు. గుర్రం ఎక్కడం సంస్కృతి, హోదా... అదే గుర్రం ఎక్కకూడదనేది వేరే వారి సంస్కృతి అన్నారు. సంస్కృతి కల్తీ లేనిదిగా చెప్పటం అసాధ్యమన్నారు. ప్రసార సాధనాల్లో వచ్చే ప్రకటనలు యువతను బాధ్యత గల పౌరులుగా తీర్చదిద్దటం లేదన్నారు. ఎన్నికల హామీలు మర్చిపోవటానికి తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందనే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దుర్గగుడి వద్ద విన్యాసాలు చేశారని చెప్పారు. దేశంలో ముస్లింలను అణిచివేయటానికి ప్రణాళిక అమలవుతోందన్నారు. ఫాసిజం ప్రమాదం నుంచి దేశాన్ని రక్షించటానికి పూనిక రావాలన్నారు. ఫాసిజం అనే మాటను బూర్జువా పార్టీకి చెందిన రాహుల్ గాంధీ కూడా వాడుతున్నారని చెప్పారు. ఫాసిజాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభిస్తే, బీజేపీ కొనసాగిస్తోందన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా బీజేపీ నమూనా ఉంటుందని... అందుకే కమ్యూనిస్టులపై సైద్ధాంతిక దాడి చేస్తుందన్నారు. వర్గపోరాటంలో ఉన్న వారు మాత్రమే ఫాసిజం నుంచి కాపాడగలరని చెప్పారు. ప్రపంచ దేశాలలో జరుగుతున్న యుద్ధ సంఘటనలు, భారతదేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత నెలకొన్న పరిణామాలను విశ్లేషించారు. ఈ అంశాలను రాఘవాచారి 30 సంవత్సరాల క్రితమే ఆలోచించి వ్యాసాలు ప్రచురించారని గుర్తు చేశారు. రాఘవాచారి ఆశించిన సమాజాన్ని తీసుకురావటమే ఆయనకు మనం ఇచ్చే నివాళి అన్నారు. ముందుగా కేఎల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బి.జమీందార్ నేతృత్వంలో 'యుద్ధాలు-దుష్పలితాలు' అంశంపై ప్రదర్శించిన లఘుచిత్రం చూపరులు హృదయాలను కలచివేసింది. ఫాసిజానికి ఆయువుపట్టు అబద్ధమని, మానవ వనరులు, ఖనిజాలను దోచుకోవటం కోసం యుద్ధాలు వస్తాయన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిందని తెలిసికూడా అమెరికా తన ఆధిపత్యం చూపించటానికి అణుబాంబులు ప్రయోగించిందని చెబుతూ ఆనాటి సంఘటనలను వివరించారు. ముందుగా సి.రాఘవాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య ఆలపించిన అభ్యుదయ గీతాలు అలరించాయి.

ప్రజా సమస్యలపై కాంగ్రెస్ నిరంతర పోరు: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు.. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులతో ప్రత్యేక సమావేశాలు జరుగుతున్నాయని అన్నారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో సోమ వారం ఆమె జిల్లా కమిటీలతో సమీక్షలు నిర్వహించారు. షర్మిల మాట్లాడుతూ, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న విశ్వసనీయతతో వారి సమస్యలపై అనునిత్యం పోరాటాలు చేయాలని, వారిలో భరోసా నింపే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. ప్రతి వారం రెండు సార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి క్యాడర్‌లో నూతన ఉత్తేజం నింపాలని, కార్యవర్గానికి సూచించినట్లు షర్మిల చెప్పారు. మత రాజకీయాలు చేస్తున్నందుకు బీజేపీ, హామీలిచ్చి మోసం చేసినందుకు వైసీపీ, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చేతులెత్తేస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు విశ్వసనీయత లేదని ప్రజలకు అర్థమైందన్నారు.

ఏవియేషన్, స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టండి

టెస్లా, రాస్‌పెరోట్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏవియేషన్, స్మార్ట్‌సిటీ, విద్యుద్దీకరణ ప్రాజెక్టుల్లో అనుకూలంగా ఉన్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కోరారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి వివిధ పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు నిర్వహించారు. పెరోట్ గ్రూప్ అండ్ హిల్‌వుడ్ డెవలప్‌మెంట్ చైర్మన్ రాస్ పెరోట్ జూనియర్‌తో పాటు అంతర్జాతీయంగా విద్యుత్ వాహనాల తయారీ రంగంలో జగజ్జేతగా ఉన్న టెస్లా సిఎఫ్‌ఓ వైభవ్ తనేజాతో లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి పుష్కలంగా ఉన్న సహజ, మానవ వనరులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించారు. ఇన్నోవేటివ్ రియల్ ఎస్టేట్, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య ప్రాజెక్టుల్లో మీ వినూత్న విధానాలు, మా రాష్ట్ర ఆర్థిక వృద్ధి, స్థిరత్వానికి తోడ్పడతాయి. మీ దార్శనిక ప్రాజెక్టులైన అలయన్స్ టెక్సాస్ వంటివి ఆంధ్ర ప్రదేశ్ మౌలిక సదుపాయాల వృద్ధి వ్యూహంతో బాగా సరిపోతాయి. అలయన్స్ టెక్సాస్ తరహాలో పారిశ్రామిక, లాజిస్టిక్ పార్కులను అభివృద్ధి చేయడానికి ఏపీలోని తీరప్రాంతంలో అనువైన వాతావరణం ఉంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, పెద్ద పట్టణాల అభివృద్ధిలో సహకారం అందించాలని ఆయన కోరారు. విశాఖపట్నంలో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఏపీలో ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి భాగస్వామ్యం వహించే అంశాన్ని పరిశీలించండి. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన ఎకో సిస్టమ్ ఉంది. ఈ రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్ర ప్రదేశ్ వ్యూహాత్మక ప్రదేశం. నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్, ఏరోస్పేస్‌లో ప్రపంచ స్థాయిలోని వారిని ఆకర్షించ డానికి మీ వంటి అనుభవజ్ఞుల నైపుణ్యం మాకు ఉపయోగపడుతుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో పోర్టులు, హైవేలు, పట్టణాభివృద్ధి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పీపీపీ ప్రాతిపదికన భాగస్వామ్యం వహించే అవకాశాలను పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా పెరోట్ జూనియర్‌ను కోరారు. విద్యుత్ వాహనాల తయారీ, పునరుత్పాదక, హరిత ఇంధన రంగాలకు, అనంతపురం జిల్లా టెస్లా ఈవీ తయారీ, బ్యాటరీ ఉత్పత్తుల యూనిట్ల ఏర్పాటుకు వ్యూహాత్మక ప్రదేశంగా ఉంటుంది. పరిశ్రమలకు అనుకూలమైన సులభతరమైన విధానాలు అమలు చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సౌరశక్తి నిల్వ వ్యవస్థలు, ముఖ్యంగా స్మార్ట్ సిటీలు, గ్రామీణ విద్యుదీకరణకు సౌర ఫలకాలను అమర్చడంలో భాగస్వామ్యం వహించాలని కోరారు. ఆర్ అండ్ డి, ఇన్నోవేషన్‌లో కీలక పాత్ర పోషిస్తూ, స్థిరమైన ఇంధన పరిష్కారాలపై దృష్టి సారించిన టెస్లా... ఆంధ్ర ప్రదేశ్‌లో టెక్నాలజీ పార్కులను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. మంత్రి వెంట ప్రతినిధి బృందం సభ్యులు కార్తికేయ మిశ్రా, సాయికాంత్ వర్మ ఉన్నారు.

2026లో గగన్‌యాన్ మిషన్?

ఇస్రో చైర్మన్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ సోమనాథ్... అంతరిక్షానికి మినిషిని పంపించే లక్ష్యంగా నిర్దేశించుకున్న మొట్టమొదటి మానవ సహిత మిషన్ 'గగన్‌యాన్' మిషన్ కు సంబంధించి కీలక సమాచారం ఇచ్చారు. ముందుగా అనుకున్నట్లు 2025లో కాకుండా... ఈ మిషన్‌ను 2026లో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆల్ ఇండియా రేడియోలో సర్దార్ పటేల్ మెమోరియల్ ప్రసంగం సందర్భంగా సోమనాథ్ ఈ కొత్త షెడ్యూల్‌ను వెల్లడించారు. చంద్రయాన్-3, మిషన్ ఆదిత్య ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో ఆ ఊపుతో... తొలిసారిగా మానవులను అంతరిక్షంలోకి పంపే గగన్‌యాన్ యాత్రను చేపట్టేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి మూడు రోజుల పాటు పంపి, సురక్షితంగా వారిని భూమిపైకి తేవడమే ఈ మిషన్ లక్ష్యం. ఆగస్టులో చంద్రయాన్-3 విజయవంతం తర్వాత తదుపరి మిషన్ అయిన గగన్‌యాన్ కోసం సిబ్బంది రేయింబవళ్లు చేసిన కృషితో ఈ మిషన్ సిద్ధమవుతున్నట్లు ఇస్రో చైర్మన్ ఇటీవలే వెల్లడించారు. గగన్‌యాన్ మిషన్‌లో ఇస్రో వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపనున్నది. ముగ్గురు వ్యోమగాములను దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తయిన కక్ష్యలోకి చేర్చి... తిరిగి వారిని భూమిపైకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రయోగం మూడు రోజులపాటు జరుగనుంది. వ్యోమగాములు తిరుగు ప్రయాణంలో సముద్రంపై సురక్షితంగా దిగాల్సి ఉంటుంది. వాస్తవానికి 2022లోనే ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా... కరోనా కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఇస్రో చేపట్టిన ఈ మిషన్ విజయవంతమైతే అమెరికా, చైనా, సోవియట్ యూనియన్ తర్వాత ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించనున్నది. మరోవైపు రాబోయే సంవత్సరాల్లో భారత్ చేపట్టనున్న అంతరిక్ష యాత్రల వివరాలను కూడా సోమనాథ్ వెల్లడించారు. శాంపిల్ రిటర్న్ మిషన్ చంద్రయాన్-4 ... 2028లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక భారత్-అమెరికా సంయుక్తంగా చేపట్ట దలచిన నిసార్ మిషన్‌పై కూడా సోమనాథ్ కీలక సమాచారం ఇచ్చారు. ఈ మిషన్‌నూ 2025లోనే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ జగ్జాతో చంద్రయాన్-5 మిషన్ ప్రయోగం చేపట్టనున్నామని, ఇది మూన్-ల్యాండింగ్ మిషన్ అని వివరించారు. ఈ మిషన్ అసలు పేరు లుపెక్స్ లేదా 'లూనార్ పోలార్ ఎక్స్‌ప్లోరేషన్' అని చెప్పారు. అయితే ఈ ప్రయోగాన్ని ఎప్పుడు చేపడతారన్న సమయాన్ని ఆయన వెల్లడించలేదు. షెడ్యూల్ ప్రకారం 2025లో ఈ ప్రయోగం చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ఆ ప్రాజెక్టుని చంద్రయాన్-5గా సోమనాథ్ పేర్కొన్నారు. కనుక చంద్రయాన్-4 పూర్తయిన తర్వాత 2028లో చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

4వ విడత కౌన్సెలింగ్‌పై పది రోజుల్లో నిర్ణయం

ఏపీఈఏపీసెట్ కన్వీనర్‌కు హైకోర్టు ఆదేశం

25 వేల ఇంజినీరింగ్ సీట్లు మిగిలాయని విద్యార్థి తల్లి పిటీషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, ఇతర వృత్తి కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఏపీఈఏపీసెట్-2024 నాలుగో విడత కౌన్సెలింగ్‌పై పది రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. కౌన్సెలింగ్‌పై ఓ విద్యార్థి తల్లి హైకోర్టులో పిటీషనర్ దాఖలు చేసింది. దీనిని విచారించిన హైకోర్టు ఈ వినతిపై పది రోజుల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని ఏపీఈఏపీ సెట్-2024 కన్వీనర్‌తోపాటు ఇతర అధికారులకు సూచించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రాజశేఖరరావు ఉత్తర్వులిచ్చారు. దీనిపై తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేశారు. మిగిలిన సీట్ల భర్తీకి నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ విజయవాడకు చెందిన విద్యార్థి తల్లి పలగర అనసూర్య హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ సమయంలో పిటిషనర్ తరఫున న్యాయవాది పాలేటి మహేశ్వరరావు కోర్టుకు వాదనలు వినిపించారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సుమారు 25 వేల సీట్లు మిగిలిపోయాయని కోర్టుకు వివరించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాల వల్ల వరదలు సంభవించాయని, వాటి కారణంగా పిటిషనర్‌తోపాటు పలువురు విద్యార్థులు గతంలో మూడు కౌన్సెలింగ్ ప్రక్రియలకు హాజరుకాలేకపోయారని, అందువల్లనే ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయారని తెలిపారు. మిగిలిన సీట్లను నాలుగో విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేయాలని కోరుతూ ఈ నెల 11న ఇచ్చిన వినతిపై అధికారులు నిర్ణయం తీసుకోలేదని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. నాలగవ విడత కౌన్సెలింగ్ వినతిపై నిర్ణయం తీసుకునేలా అధికారులను ఆదేశించాలని పిటిషనర్ తరపు లాయర్ కోర్టును కోరారు. లాయర్ వాదనలతో ఏకీభవించి న్యాయమూర్తి అందుకు అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మూడో విడత కౌన్సెలింగ్ సమయంలో భారీ వర్షాలు, వరదల కారణంగా చాలా మంది విద్యార్థులు సీట్లు పొంది.. .ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయలేకపోయారు. విజయవాడ కేబీఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో రిపోర్ట్ చేసేందుకు వెళ్లిన ఓ విద్యార్థి వరద నీటిలో కొట్టుకుపోయి దుర్మరణం చెందారు. ఇదే తరహాగా అనేక చోట్ల విద్యార్థులు ఆయా కళాశాలలకు వెళ్లి రిపోర్ట్ చేయలేకపోయారు. ఆయా సంఘటనలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టులో విద్యార్థి తల్లి పిటిషన్ వేయడంతో నాలుగో విడత కౌన్సింగ్‌పై పది రోజుల్లో నిర్ణయించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

కీలక రంగాల్లో సహకరించుకుందాం

భారత్-స్పెయిన్ నిర్ణయం
ద్వైపాక్షిక సమావేశంలో వివిధ ఒప్పందాలపై సంతకాలు

వడోదర: భారత్, స్పెయిన్‌లు వివిధ రంగాలకు సంబంధించి అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ మధ్య ద్వైపాక్షిక భేటీలో ఈ మేరకు నిర్ణయాలు జరిగాయి. ఇక్కడి చారిత్రాత్మక లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా.. ఉక్రెయిన్, పశ్చిమాసియాలోని పరిస్థితులపై కూడా ఇరువురు నేతలు చర్చించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి తన్మయ లాల్ తెలిపారు. 'ఉక్రెయిన్‌కు సంబంధించి ఇరుదేశాలు పరిస్థితిని ఎలా చూస్తున్నాయి అనే దానిపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అటువంటి వివాదాన్ని చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే పరిష్కరించగలమని ప్రధాని మోదీ భారత్ వైఖరిని పునరుద్ఘాటించారు. ఇది యుద్ధానికి సమయం కాదు... దీనిని పరిష్కరించలేము. రెండు దేశాల మధ్య ముఖాముఖి చర్చ జరగాలి" అని లాల్ విలేకరులతో అన్నారు. స్వేచ్ఛ బహిరంగ, సమ్మిళిత, సుసంపన్న, శాంతియుత ఇండో-పసిఫిక్ ను కోరుకుంటున్నదని భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించిందని చెప్పారు. త్వరలో విడుదల చేయబోయే ఉమ్మడి ప్రకటనలో దీనిపై మరిన్ని వివరాలను వెల్లడిస్తామని ఆయన అన్నారు. భారత్, స్పెయిన్‌లు ద్వైపాక్షిక చర్చల సందర్భంగా మౌలిక సదుపాయాలు, రైల్వేలతో పాటు సంస్కృతి, పర్యాటకం వంటి కీలక రంగాల్లో సహకారంపై ఒప్పందాలపై సంతకాలు చేశాయని తెలిపారు. రైల్వేకి సంబంధించి మౌలిక సదుపాయాలు, స్టేషన్లు, రైల్వే సౌకర్యాలు, సుదూర ప్రయాణీకుల ఉపకరణాలు, సరుకు రవాణా నెట్‌వర్క్‌లతో పాటు అర్బన్, ప్రాంతీయ రైల్వే వ్యవస్థలకు సంబంధించి ప్రణాళిక రూపకల్పన, అభివృద్ధి, ఆపరేషన్‌లో సహకారం కోసం ఒప్పందంపై సంతకం చేసినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. ఈ సమావేశంలో, 2026ని 'ఇండియా-స్పెయి న్ సంస్కృతి, పర్యాటకం ఏఐ సంవత్సరం'గా జరుపుకోవాలని నిర్ణయించారు. అంతేకాకుండా సంగీతం, నృత్యం, సాహిత్యం, థియేటర్, మ్యూజియం ఇలా వివిధ అంశాల్లో ద్వైపాక్షిక మార్పిడిని ప్రోత్సహించడానికి కూడా సంతకలు జరిగాయి. ఇక కస్టమ్స్ సంబంధిత విషయాలలో సహకారం, పరస్పర సహాయం చేసుకునే ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

ప్రైవేటు కార్యక్రమాల్లో న్యాయ సంభాషణలు ఉండవు

సీజేఐ చంద్రచూడ్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ గణేశ్ పూజ కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇంటికి వెళ్లడం... అది రాజకీయ వివాదం కావడం తెలిసిందే. మరి కొద్ది రోజుల్లో పదవీ విరమణ చేయనున్న తరుణంలో ఆ వివాదంపై జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పందించారు. అటువంటి భేటీల్లో న్యాయపరమైన విషయాలు ఏవీ చర్చించబడవని అన్నారు. లోక్‌సత్తా వార్షిక ఉపన్యాసంలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ... ముఖ్యమంత్రులు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీ అని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. ఈ సమావేశాలు ఎందుకు అని ప్రజలు అనుకుంటున్నారు కానీ... రాజకీయ వర్గాల్లో కూడా న్యాయవ్యవస్థ పట్ల ఎంతో గౌరవం ఉండడంలోనే మన రాజకీయ వ్యవస్థ పరిపక్వత దాగి ఉంది.. న్యాయవ్యవస్థ బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వానిదేనన్న సంగతి తెలిసిందే. ఇది న్యాయమూర్తుల కోసం ఉద్దేశించిన బడ్జెట్ కాదు. కొత్త కోర్టు భవనాలు, న్యాయమూర్తుల కోసం కొత్త నివాసాలు అవసరం. దీనికి ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి చర్చించడం అవసరం' అన్నారు. తాను గతంలో అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశానని ఆయన తెలిపారు. "ప్రధాన న్యాయమూర్తిని నియమించినప్పుడు, వారు ముఖ్యమంత్రి ఇంటికి వెళతారు. అప్పుడు ముఖ్యమంత్రి చీఫ్ జస్టిస్ ఇంటికి వస్తారు' అన్నారు. 'రాజకీయ వ్యవస్థలో చాలా పరిణతి ఉంది. ఈ సమావేశాల సమయంలో, పెండింగ్ కేసు గురించి ముఖ్యమంత్రి ఎప్పుడూ అడగరు. ఆగస్టు 14, మరియు జనవరి 26, శుభ కార్యాలు... ఇటువంటి సందర్భాల్లో ముఖ్యమంత్రి మరియు ముఖ్యమంత్రి , ప్రధాన న్యాయమూర్తి ఒకరినొకరు కలుసుకోవడం పరిపాటి' అన్నారు. ఇలాంటి వాటి వల్ల న్యాయవ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉండదా అని కొందరు అడుగుతారని... ఇది బలమైన సంభాషణలో భాగం మాత్రమేనని చంద్రచూడ్ స్పష్టం చేశారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద బాధితుల సహాయార్థం విరాళాలు వెల్లువెత్తాయి. సీఎం సహాయనిధికి వివిధ సంస్థలు, కంపెనీలు, వ్యక్తులు ముందుకొచ్చి విరాళాలను అంద జేశాయి. సీఎం చంద్రబాబును సోమవారం సచివాలయంలో కలిసి వరద బాధితులకు కోసం చెక్‌లు అందజేశారు. రేమండ్ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ సింఘానియా రూ.2 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా జోనల్ హెడ్ జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, జోనల్ డిప్యూటీ మేనేజర్ సుధాకర్ రూ.కోటి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ తరపున గంగవరపు విజయ్ భాస్కర్ రూ.65 లక్షలు, రాష్ట్రీయ సేవా సమితి తరపున జనరల్ సెక్రటరీ వెంకటరత్నం, జాయింట్ సెక్రటరీ డాక్టర్ మమత, ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు, సాయిబాబా రూ.50 లక్షలు, మద్దిపట్ల కృష్ణా, ఎన్ఆర్ఐ రూ.10 లక్షలు, థామస్య రూ.1.75 లక్షలు చెక్‌ల రూపేణా ఇచ్చారు. కొర్రపాటి సురేంద్ర రూ.1.50 లక్షలు, తులసీ కృష్ణమూర్తి రూ.1.18 లక్షలు, కె.రమేశ్ రూ.1.116 లోలు, కె.నారాయణ రూ.లక్ష, ఎస్ఎల్ఎన్ శాస్త్రి రూ.70 వేలు, కోలా మన్మధరావు రూ.50 వేలు, విశ్వవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ (విజయవాడ- పడమట) విద్యార్థులు రూ.50 వేలు, నరేంద్ర రూ.50 వేలు, రాజశేఖర్ రూ.50 వేలు, కోనేరు వెంకటరామ్ రూ.25 వేలు అందించారు.

ప్రాథమిక ఉపాధ్యాయులకూ ఎమ్మెల్సీ ఓటు హక్కు

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కత్తి నరసింహారెడ్డి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకూ ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం ఎస్టీయూ-తెలంగాణ నేతలతో కేంద్రమంత్రిని ఆయన కలిశారు. దీనిపై దీనిపై కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ-తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎం.పర్వతరెడ్డి, జి.సదానందగౌడ్ పాల్గొన్నారు.

సంస్థాగత పతనం కుటిలత్వానికి దారి తీసింది

సెబీ చైర్‌పర్సన్‌పై రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సోమవారం తాజాగా సెబీ చైర్‌పర్సన్ మాధవి బుచ్‌పై విమర్శలు చేశారు. 'సంస్థాగత పతనం ఇప్పుడు మరింత ప్రమాదకరమైన కుటిలవాదానికి దారితీసింది... అదానీ బచావో. ప్రస్తుత పాలన ఇకపై గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహించడం కాదు. ఇది దేశ సంపదను కొంతమంది చేతుల్లో చురుకుగా కేంద్రీకరిస్తోంది' అని గాంధీ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. మాధవి బుచ్ కుంభకోణం మొదట ఊహించిన దానికంటే లోతుగా ఉందంటూ... రిటైల్ పెట్టుబడిదారులను రక్షించే బాధ్యతలో ఉన్న బుచ్... అదానీ ప్రయోజనాలను, అతని విలువలను రక్షించడానికి ఆ వ్యవస్థను తారుమారు చేసి ఉండవచ్చని అన్నారు. సామాన్య భారతీయులను, వారి పెట్టుబడులను రక్షించే బాధ్యత అప్పగించిన వారు తమ బాధ్యతలను రద్దు చేసుకున్నారు. విస్తృతస్థాయి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ఈ సమస్యలను నిరంతరం లేవనెత్తుతోందని, ఈ కుంభకోణాలపై దర్యాప్తు చేస్తోందని, ప్రజలకు వాస్తవాన్ని బహిర్గతం చేస్తోందని తెలిపారు.

ముస్లిం చొరబాటుదారులను దహనం చేయాలి: హిమంత

రాంచీ: జార్ఖండ్‌లో గిరిజనుల జనాభా కంటే ముస్లింల జనాభా ఎక్కువగా ఉందని, చొరబాటుదారులైన ముస్లింలకు నిప్పటించి... జార్ఖండ్‌ను బంగారుభూమిగా మార్చుకోవాలని బీజేపీకి ఎన్నికల ఇంచార్జీగా వ్యవహరిస్తున్న అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'హనుమంతుడు లంకలో నిప్పంటించాడు. అలాగే జార్ఖండ్‌లోని చొరబాటుదారులపై నిప్పంటించి జార్ఖండ్‌ను బంగారు భూమిగా మార్చాలి. సంతల్ పరగణలో గిరిజన జనాభా తగ్గుతోంది. ముస్లిం జనాభా పెరుగుతోంది. రాష్ట్రంలో అక్రమంగా చొరబాటు కాకపోతే ముస్లిం జనాభా పెరగడానికి కారణం ఏమిటి? నా ఉద్దేశం రాష్ట్రంలో ప్రతి ముస్లిం చొరబాటు దారుడుకాదు. కానీ ప్రతి ఐదు సంవత్సరాలకు ముస్లిం జనాభా ఎలా పెరుగుతోంది. ఒక కుటుంబంలో 10-12 మంది పిల్లలు జన్మనిస్తున్నారా? అయితే కుటుంబాలు చాలామంది పిల్లలకు జన్మనివ్వకపోతే కచ్చితంగా ముస్లిం ప్రజలు బయటి నుండి వస్తున్నారు. ఇవి సాధారణ లెక్కలే. ఈ ఎన్నికల్లో మేము గెలుస్తాం. కానీ అది ప్రధానం కాదు. సంతల్ పరగణా నుంచి చొరబాటుదారులను తరిమేయడం, మహిళలకు న్యాయం చేయడమే ప్రధానం' అని ఆయన అన్నారు. 'జార్ఖండ్‌లో చొరబాటుదారులకు మదర్సాలో శిక్షణ ఇస్తున్నట్లు జార్ఖండ్ ప్రభుత్వ లేఖలో చూశాం. వారికి ప్రభుత్వం ఆధార్ కార్డులు మంజూరు చేసింది. ఇలాంటి చాలా విషయాలు ముందుకు వస్తున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.